కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

తుఫాన్ కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ 08924-222888, 08924-225999, 08924-226599 ఫోన్ నంబర్లతో 24 గంటలూ సిబ్బందిని అందుబాటులో వుంచారు. డీఆర్‌ఓ సత్యనారాయణరావు, డీటీ లివింగ్‌స్టన్ పర్యవేక్షణలో జిల్లాలో అన్ని మండలాల నుంచి అందే సమాచారంపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేలా ఏర్పాట్లు చేశారు. డివిజన్, మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, తుఫాన్/ వర్షాల తీవ్రతపై ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా ఏర్పాట్లు చేశారు.



పొంచి ఉన్న మొంథా ముప్పు

తుఫాన్‌గా మారనున్న తీవ్ర వాయుగుండం

- మూడు రోజులపాటు జిల్లాకు భారీ వర్షసూచన
- ఈదురు గాలులు వీచే అవకాశం
- ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం
- కలెక్టరేట్, ఆర్డీవో, తహశీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు
- నేటి నుంచి మూడు రోజులపాటు అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించిన కలెక్టర్
- మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు
- సముద్ర తీరంలో పర్యాటక, సందర్శనీయ ప్రదేశాలు మూసివేత
- విపత్కర పరిస్థితులు ఏర్పడితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశం
- తుఫాన్ రక్షిత భవనాలు, పాఠశాలల భవనాలు సిద్ధం



నక్కపల్లి మండలం రాజయ్యపేట తీరంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐలు

అనకాపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్): **ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం తుఫాన్‌గా మారుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌తోపాటు అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయాలు, అన్ని తహశీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి కార్యాలయంలో సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి, ఫోన్ నంబర్లను అందుబాటులో వుంచారు. ఆదివారం జిల్లాలో వర్షం పడనప్పటికీ తుఫాన్ ప్రభావంతో సోమవారం నుంచి మూడు, నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం వుందన్న వాతావరణ శాఖ సమాచారంతో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. అన్ని విద్యా సంస్థలకు 27, 28, 20 తేదీల్లో సెలవు ప్రకటించారు. తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి వి.వినయ్‌చంద్ అమరావతి నుంచి ఆదివారం సాయంత్రం అనకాపల్లి జిల్లాకు చేరుకున్నారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల అధికారులతో సమావేశాలు నిర్వహించి, పలు సూచనలు ఇచ్చారు.**



పాయకరావుపేట తహశీలారు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి వి.వినయ్‌చంద్

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం సోమవారం తెల్లవారుజామున తుఫాన్‌గా మారుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో కలెక్టర్ విజయకృష్ణన్ జిల్లాలో అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. కోస్తాలో కాకినాడ- తుని మధ్య తుఫాన్ తీరం దాటుతుందని, 27, 28, 29 తేదీల్లో ఇది తీవ్ర ప్రభావం చూపనుందని, అందువల్ల అన్ని మండలాల అధికారులు స్థానికంగా అందుబాటులో వుండాలని సూచించారు. భారీ వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం వున్నందున ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం ... మిగతా 6వ పేజీలో

పర్యాటక ప్రదేశాలు మూసివేత

మత్స్యకారులను అప్రమత్తం చేసిన అధికారులు

'మొంథా' తుఫాన్ నేపథ్యంలో అధికారులు ముందు జాగ్రత్త చర్యగా జిల్లాలో సముద్ర తీరంలో ఉన్న పలు పర్యాటక ప్రదేశాలను మూసివేశారు. రెవెన్యూ, పోలీసు, మత్స్య శాఖల అధికారులు పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, అచ్యుతాపురం మండలం పూడి మడక, వాడపాలెం, రాంబిల్లి మండలం సీతపాలెం, వాడరాంబిల్లి, ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెం, రేవుపోలవరం, నక్కపల్లి మండలం పెదతీనార్ల, చినతీనార్ల, రాజయ్యపేట, బోయపాడు, అమలాపురం, డీఎల్‌పురం, పాయకరావుపేట మండలంలో పెంటకోట, గజపతినగరం, తదితర గ్రామాలకు వెళ్లి మత్స్యకారులు గురువారం వరకు సముద్రంలో వేటకు వెళ్లవద్దని హెచ్చరికాలు జారీ చేశారు.

ఏజెన్సీలో..

మొంథా తుఫాన్ నేపథ్యంలో ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను మూసివేయాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలకు సందర్శకుల ప్రవేశాలు నిలిపి వేయాలని ఆదేశించారు. జలపాతాల వద్దకు పర్యాటకులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.



ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం వద్ద సముద్రతీరంలోకి సందర్శకులు వెళ్లకుండా బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

సర్వత్రా అప్రమత్తం

ప్రభుత్వ ఉద్యోగులు పనిచేస్తున్న కేంద్రాలను విడిచివెళ్లొద్దు

- తుఫాన్ రక్షిత భవనాలను సిద్ధం చేయండి
- విపత్కర పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- జిల్లా ప్రత్యేక అధికారి వి.వినయ్‌చంద్ ఆదేశం
- 'పేట, ఎస్.రాయవరం మండలాల అధికారులతో సమావేశం

ఎస్.రాయవరం/ పాయకరావుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అనకాపల్లి జిల్లాకు ప్రత్యేక అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారి వి.వినయ్‌చంద్ ఆదివారం సాయంత్రం పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల అధికారులతో ఆయా మండలం కేంద్రాల్లో సమావేశమయ్యారు. తుఫాన్ సందర్భంగా ముందస్తు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎస్.రాయవరం అధికారులతో మాట్లాడుతూ, తుఫాన్ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వుండాలని, అందరూ తాము పనిచేస్తున్న కేంద్రాలను విడిచి వెళ్లవద్దని స్పష్టం చేశారు. 28వ తేదీనుంచి భారీ వర్షాలు పడడంతోపాటు గంటకు 70 నుంచి 80 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 24 గంటలూ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అందరూ అప్రమత్తంగా ఉండాలి.



ఎస్.రాయవరం తహశీల్దారు కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ప్రత్యేక అధికారి వినయ్‌చంద్

పాయకరావుపేటలో నిర్వహించిన సమావేశంలో వినయ్‌చంద్ మాట్లాడుతూ, తుఫాన్ కారణంగా భారీవర్షాలతోపాటు ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున మండలంలోని అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తుఫాన్ వల్ల కలిగే నష్టాలను, విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు తీసుకోవలసిన చర్యల గురించి చర్చించారు. సముద్ర తీర గ్రామాల్లోని తుఫాన్ రక్షిత భవనాలను సిద్ధం చేయాలని, అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు.

సముద్ర తీరగ్రామాల్లో దండోరా వేయించాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, ఎస్.రాయవరం మండల ప్రత్యేక అధికారి మనోరమ, తహశీల్దార్ జె.రమేశ్‌బాబు, ఎంపీడీవో మీనా కుమారి, పంచాయతీరాజ్ డీఈ కుమార్ రాజా, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, పాయకరావుపేట తహశీల్దారు ఎస్.ఎ.మహేశ్వరరావు, ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవోట డేవిడ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫణివర్మ, విద్యుత్ శాఖ ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకూ టెట్

సుప్రీంకోర్టు తీర్పు అమలుకు ప్రభుత్వ నిర్ణయం

- ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల
- 2014కు ముందు విధుల్లో చేరిన వారికి వర్తింపు
- ఐదేళ్లలో రిటైరయ్యే వారికి మినహాయింపు
- ఉమ్మడి జిల్లాలో పది వేల మందికి పరీక్ష
- రివ్యూ పిటిషన్ వేయాలంటున్న ఉపాధ్యాయ సంఘాలు



విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): **ఉపాధ్యాయులు (ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వారు) కూడా 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష' (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్-టెట్)లో అర్హత సాధించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా తాజాగా నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఉపాధ్యాయుల్లో అలజడి మొదలైంది.**

టెట్‌కు వచ్చే నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, డిసెంబరు 10న పరీక్ష నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. 2014 కంటే ఉద్యోగంలో చేరిన వారంతా టెట్‌లో అర్హత సాధించాల్సి ఉంది. అయితే 2030 ఆగస్టు 31లోగా ఉద్యోగ విరమణ చేయనున్న వారు, 1968 ఆగస్టు 31 లోగా పుట్టిన వారు టెట్ రాయాల్సిన అవసరం లేదు. రెండేళ్లలో టెట్‌లో అర్హత సాధించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలుపై ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. డీఎస్సీలో మెరిట్ సాధించి విధుల్లో చేరిన పదిహేనేళ్ల తరువాత టెట్ రాయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలు పక్షనపడేశాయని, ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం పునరాలోచించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గణితం టీచర్‌కు బయాలజీ పరీక్ష

టెట్‌లో రెండు భాగాలు...లెవెల్ 1, 2 పేపర్లు ఉంటాయి. ప్రాథమిక పాఠశాలల్లో బోధించే టీచర్లు అన్ని సబ్జెక్టులతో కూడిన లెవెల్-1 పరీక్ష రాయాలి. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బోధించే వారు లెవెల్-2 పరీక్ష రాయాలి. ఇందులో గణితం/సైన్స్ ఒక పేపర్ కాగా ఆర్ట్స్/లాంగ్వేజెస్‌తో మరో పేపర్ ఉంటుంది. ప్రతి పేపర్ 150 మార్కులకు ఇస్తారు. గణితం/సైన్స్, తెలుగు భాషపై అవగాహన, కంప్యూటర్ నైపుణ్యం, సైకాలజీ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు తయారుచేస్తారు. గణితం స్కూలు అసిస్టెంట్‌కు గణితం, భౌతికశాస్త్రంపై అవగాహన ఉంటుంది తప్ప జీవశాస్త్రంతో సంబంధం ఉండదు. బయాలజీ టీచర్ గణితంపై ప్రశ్నలకు జవాబులు రాయలేరు. సోషల్ టీచర్‌కు తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లోని కొన్ని కీలక పాఠ్యాంశాలపై అవగాహన ఉండదు. ప్రాథమిక పాఠశాలల్లో బోధించే ఎస్జీటీ, భవిష్యత్తులో పదోన్నతి కోరుకుంటే లెవెల్-2 పరీక్ష రాయాలి.

ఉమ్మడి జిల్లాలో పది వేల మంది

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, గిరిజన సంక్షేమ శాఖ, గురుకులాల్లో సుమారు 15 వేల మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో 2014కు ముందు నియమితులైన, టెట్ రాయాల్సిన టీచర్లు నది వేల మంది వరకూ ఉంటారని అంచనా వేస్తున్నారు. 2014 తరువాత మూడు డీఎస్సీలు నిర్వహించారు. వీరంతా టెట్ అర్హత సాధించిన తరువాతే డీఎస్సీ ద్వారా ఎంపికై ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారు ఇప్పుడు కొత్తగా టెట్ రాయాల్సిన అవసరం లేదు. 2014కు ముందు పలు డీఎస్సీల ద్వారా ఎంపికై 1968 ఆగస్టు 31 తరువాత పుట్టినవారు, 2030 ఆగస్టు 31 తరువాత పదవీ విరమణ చేయనున్న టీచర్లు టెట్ అర్హత సాధించాలి. ఓపెన్ కేటగిరీ అయితే 90 మార్కులు, బీసీ అభ్యర్థులు 75 మార్కులు, ఎస్సీ/ఎస్టీలు 60 మార్కులు సాధించాలి. రెండేళ్లు అంటే 2027 సెప్టెంబరు నెలాఖరులోగా టెట్ అర్హత సాధించాలి. టీచర్లు టెట్ రాయాలని ఆదేశించడంపై ఎస్టీటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వం స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు.

భూతల నరకం!

వాహనదారులకు చుక్కలు చూపిస్తున్న రహదారులు

- దారుణంగా తయారైన బీఎన్ రోడ్డు, వడ్డాది-పాడేరు రోడ్డు
- అడుగడుగునా గోతులతో ప్రయాణికుల ఒళ్లు హూనం
- ప్రకటనలకే పరిమితమైన ప్రజాప్రతినిధులు మాటలు

చోడవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): **మూడు జిల్లాల ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం అంటే ఏమిటో చూపిస్తున్నాయి రెండు ప్రధాన రహదారులు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖ జిల్లాలకు చెందిన ప్రజలు అధికంగా ప్రయాణించే భీమిలి- నర్సీపట్నం (బీఎన్) రోడ్డు, వడ్డాది- పాడేరు రోడ్డు అత్యంతా దారుణంగా తయారయ్యాయి. ఈ రహదారుల దుస్థితి వర్ణనాతీతం. వైసీపీ ప్రభుత్వం హయాంలో అధ్వానంగా తయారైన బీఎన్ రోడ్డు.. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. పైగా మరింత దారుణంగా తయారైంది. దీంతో వాహనదారులు, ప్రయాణికుల ఇక్కట్లు రెట్టింపు అయ్యాయి.**

చోడవరం నియోజకవర్గం పరిధిలో చోడవరం మండలం వెంకన్నపాలెం నుంచి రోలుగుంట మండలం వెలంకాయలపాలెం వరకు 45 కిలోమీటర్లమేర బీఎన్ రోడ్డు చాలా వరకు పాడైంది. ముఖ్యంగా వెంకన్నపాలెం, అంభేరుపురం, గోవాడ, చోడవరంలో కొత్తూరు జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్, వడ్డాది. బంగారుమెట్ట, పొట్టిదొరపాలెం, కోమళ్లపూడి, రావికమతం, మేడివాడ, కొత్తకోట, రోలుగుంట గ్రామాల వద్ద తారు రోడ్డు ఆనవాళ్లు లేదు. ఎక్కడికక్కడ భారీ గోతులు ఏర్పడి, వర్షం కురిస్తే చెరువులను తలపిస్తున్నాయి. గోతుల వద్ద వాహనాలు చాలా నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో ట్రాఫిక్ స్తంభిస్తున్నది. ఆటోలు, బస్సుల్లో ప్రయాణించేవారి ఒళ్లు హూనం అవుతున్నది. గోతుల కారణంగా వాహనాలు ... మిగతా 6వ పేజీలో



చోడవరం మండలం అంభేరుపురం సమీపంలో దారుణంగా తయారైన రోడ్డు



బుచ్చెయ్యపేట మండలం వద్ద బీఎన్ రోడ్డుపై చెరువు!



వడ్డాది- పాడేరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో కోడూరు వద్ద రహదారి దుస్థితి

ఇంగ్లండ్ జోరు

అమీజోన్స్ అజేయ అర్థ సెంచరీ

- ఎనిమిది వికెట్ల తేడాతో విజయం
- చివరి మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్‌కు తప్పని ఓటమి


విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా ఆదివారం ఇక్కడి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఎనిమిది వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ రన్నరప్ ఇంగ్లండ్...పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఇంగ్లండ్ ఓపెనర్లు అమీ జోన్స్ (86 నాటౌట్; 11 ఫోర్లు, 1 సిక్సర్), టామీ బ్యూమౌంట్ (40; 7 బౌండరీలు) తొలి వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు సునాయాస విజయాన్నందించారు. న్యూజిలాండ్ నిర్దేశించిన 169 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 29.2 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు నష్టపోయి ఛేదించింది. ఓపెనర్ ... మిగతా 6వ పేజీలో



అమీజోన్స్ (86 రన్స్)

కల్యాణపులోవకు 280 క్యూసెక్కుల వరద

రావికమతం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతున్నది. గరిష్ఠ నీటమట్టం 460 అగులుకాగా, 280 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతున్నది. ఆదివారం నీటిమట్టం 458.04 అడుగుల వద్ద నిలకడగా వుంచుతూ, స్పిల్‌వేలో రెండు గేట్లు ఎత్తి 250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని, దీంతో రిజర్వాయర్‌కు వరద పెరిగి, నదిలోకి అధిక మొత్తంలో నీటిని విడుదల చేయాల్సి వస్తుందని జలాశయం ఏఈ డి.సూర్య తెలిపారు.



కల్యాణపులోవ రిజర్వాయర్ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

పెద్దేరు నుంచి 400 క్యూసెక్కులు

మాడుగుల రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎగువనున్న ఏజెన్సీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పెద్దేరు జలాశయంలో వరద నీరు చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా ఆదివారం 265 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 135.95 మీటర్లకు చేరింది. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం రాత్రి జలాశయం మూడో గేటు ఎత్తి 400 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నట్టు ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రైవాడ నుంచి 1800 క్యూసెక్కులు విడుదల

దేవరాపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయం నుంచి 1,800 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నట్టు డీఈఈ సత్యంనాయుడు తెలిపారు. గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, ఆదివారం వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 112.35 మీటర్లుగా నమోదయింది. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు గేట్లు ఎత్తి 1,800 క్యూసెక్కుల నీటిని శారదా నదిలోకి విడుదల చేస్తున్నామని, నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

కనకమహాలక్ష్మి ఆలయ చైర్మన్‌గా కొఠారు సాంబ



కొఠారు సాంబను అభినందిస్తున్న నేతలు, స్థానికులు

ఎలమంచిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ధర్మవరంలోని కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్‌గా కొఠారు సాంబ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆలయ ఆవరణలో స్థానికులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయన్ని ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సాంబను మునిసిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, కొఠారు కొండబాబు, మడుతగుల సత్యనారాయణ, కొఠారు నరేష్, రాము, యువకులు అభినందించారు.

ఓవర్‌లోడ్ లారీలపై కేసు నమోదు

మునగపాక, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్‌తో వెళ్తున్న రెండు లారీలపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వైపు ఓవర్ లోడ్‌తో వెళ్తున్న రెండు లారీలను ఆదివారం మునగపాక జంక్షన్‌లో పట్టుకున్నామన్నారు. ఒక్కో లారీకి రూ.20 వేలు చొప్పున చలానా రాయడం జరిగిందన్నారు.

శ్రీకాళహస్తి దేవస్థానం డైరెక్టర్‌గా స్రవంతి ప్రమాణ స్వీకారం



స్రవంతికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారి

మునగపాక, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు డైరెక్టర్‌గా బీలా స్రవంతి ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. దేవస్థానంలో చైర్మన్, బోర్డు డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశామని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం అర్చకులు ఆలయ మర్యాదలతో స్వామివారిని దర్శించుకున్నా మన్నారు. కార్యక్రమంలో ఆమె భర్త బీలా లక్ష్మణరావు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అప్పలరాజును కలిసిన మత్స్యకారులు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ఆదివారం పలాసలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టరు చోడిపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మత్స్యకారులు కలిశారు. బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న ఆందోళనను ఆయనకు వివరించారు. రాజయ్యపేట వచ్చి మత్స్యకారులకు సంఘీభావం తెలుపుతానని అప్పలరాజు హామీ ఇచ్చారని శ్రీనివాసరావు తెలిపారు. ఆయన వెంట రాజయ్యపేట మత్స్యకారులు వై.నాగేశ్, పి.నాగరాజు, వై.కోటయ్య, కె.వెంకటేశ్, జె.అప్పలరాజు, బి.కాశీ, డి.నానాజీ, సీహెచ్.కాశీ, ఎం.రాము, తదితరులు పాల్గొన్నారు.

'టీడీఆర్ నోటిఫికేషన్ రద్దు చేయాలి'

అచ్యుతాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీఆర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని అచ్యుతాపురం-అనకాపల్లి భూనిర్వాసితులు ఆదివారం చోడపల్లి, కొండకర్ల, హరిపాలెం, తిమ్మరాజుపేటల్లో ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితుల సంఘం నాయకుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ తాము ఆది నుంచి టీడీఆర్ బాండ్లను వ్యతిరేకిస్తున్నామని, అధికారులు మాత్రం బాండ్లనే ఇస్తామని పట్టుపట్టారన్నారు. ఈ అంశంపై సోమవారం మునగపాకలో నిర్వాసితులతో మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో కె. సోమునాయుడు, కాకి శంకర్, ఎల్లపు వెంకటరావు, కడారి అప్పారావు, బాబూరావు, గణేష్, శివ, రామకృష్ణ పాల్గొన్నారు.

వైన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా జేఎస్‌గా వర్మరాజు




రాంబిల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా వైన్ డీలర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా రాంబిల్లికి చెందిన భూపతిరాజు వర్మరాజు నియమితులయ్యారు. ఆదివారం అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఈయన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వర్మరాజు మాట్లాడుతూ తనపై నమ్మకముంచి పదవిని ఇచ్చిన వైన్ డీలర్లు అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఐని కలిసిన టీడీపీ నాయకులు

నక్కపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన జే మురళీని ఆదివారం రాత్రి స్థానిక టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల వెంకటరమణ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి, గింజాల శ్రీను తదితరులు కలిశారు. శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని సీఐ కోరారు.

పూడిమడక ఉప్పుటేరు కాలుష్యం



నలుపురంగులో పూడిమడక ఉప్పుటేరు

అచ్యుతాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్మాగారాల నుంచి కాలుష్య జలాలు ఒకేసారి వదిలేయడంతో పూడిమడక ఉప్పుటేరు నల్లగా మారిపోయింది. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తమ పడవల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో మత్స్యకారులు తలమునకలై ఉన్నారు. ఈలోగా ఉప్పుటేరులోని నీరు నల్లగా మారిపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందారు. తుఫాన్ కారణంగా సముద్రం పొంగి ఉప్పుటేరులోకి కూడా భారీగా సముద్రపు నీరు చేరుతుందన్న ఉద్దేశంతో కర్మాగారాలు ఒకేసారి కలుషిత నీటిని వదిలేశారని మత్స్యకార నాయకుడు చేపల తాతలు తెలిపారు.

కబడ్డీ పోటీల విజేత వాడ్రాపల్లి కింగ్స్ జట్టు

మునగపాక, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో శనివారం రాత్రి టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో వాడ్రాపల్లికి చెందిన కబడ్డీ కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. పెదరామాలయం జంక్షన్ వద్ద తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మళ్ల వరహానర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైనల్ పోటీల్లో అచ్యుతాపురం జట్టుపై కబడ్డీ కింగ్స్ ఘన విజయం సాధించి కప్పును సొంతం చేసుకుంది. ద్వితీయ స్థానంలో అచ్యుతాపురం, తృతీయ స్థానంలో రాజాం, నాల్గో స్థానంలో డ్రీమ్‌బాయ్స్ జట్టు, ఐదో స్థానంలో నాగులాపల్లి జట్టు విజేతలుగా నిలిచాయి. విజేతలకు టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ పరిశీలకుడు బొండా జగన్ బహుమతులు అందజేశారు. అదే గ్రామంలో సతకంపట్టు వద్ద జనసేన మద్దతుదారుడు కొయిలాడ దశావతారం సారథ్యంలో జరిగిన పోటీల్లో కబడ్డీ కింగ్స్ ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో జంపపాలెం, తృతీయ స్థానంలో కుంచంగి, నాల్గో స్థానంలో అచ్యుతాపురం, ఐదో స్థానంలో వీరాంజనేయ జట్లు నిలిచాయి. విజేతలకు జనసేన నాయకులు బహుమతులను అందజేశారు.

మొంథా తుఫాన్.. అంతా అటెన్షన్

- సురక్షిత ప్రాంతాలకు వలలు, పడవలు తరలింపు
- సముద్రంలో వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు
- తీరంలో పర్యటించిన రెవెన్యూ, పోలీస్ అధికారులు
- సురక్షిత ప్రాంతాలకు కొన్ని కుటుంబాలు తరలింపు

అచ్యుతాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికలతో పూడిమడక మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. తుఫాన్ తీవ్రత అధికంగా ఉంటుందని అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో మత్స్యకారులు తమ పడవలను సురక్షిత ప్రాంతాలకు ఆదివారం తరలించారు. పూడిమడక తీరంలో జాలారిపాలెం, పెద్దూరు, కొండపాలెం, కడపాలెంకి చెందిన పడవలు ఉంటాయి. జాలారిపాలెం జాలర్లు తమ పడవలను లైట్‌హౌస్ ఉన్న ప్రాంతానికి తీసుకువెళ్లి ఎత్తయిన ప్రదేశంలో పెట్టుకున్నారు. అలాగే వలలను ఎత్తయిన ఇసుక దిబ్బలపై పెట్టుకున్నారు. పెద్దూరుకి చెందిన మత్స్యకారులు తమ పడవలను పొగిరి మీదుగా ఉప్పుటేరులో పెట్టారు. అలాగే కొండపాలెం, కడపాలెంకి చెందిన మత్స్యకారులు తమ పడవలను తీరంలో గల చెట్లకు తాళ్లతో కట్టారు. ఎంపీడీఓ చిన్నారావు, ఈవోపీఆర్డీ బాబూరావు పూడిమడకలో ఆదివారం పర్యటించి తుఫాన్ రక్షిత భవనాలను సిద్ధం చేశారు. సీఐ నమ్మి గణేష్, మెరైన్ సీఐ సింహాద్రి నాయుడు సిబ్బందితో పూడిమడక, వాడపాలెం తీరాల్లో పర్యటించి సముద్రంలోకి ఎవరూ వెళ్లకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు.



అచ్యుతాపురం: పూడిమడక తీరంలో సూచనలిస్తున్న ఎంపీడీఓ చిన్నారావు

తీరంలో పర్యటించిన పోలీస్ అధికారులు

నక్కపల్లి: తుఫాన్ నేపథ్యంలో ఆదివారం మండలంలోని పెదతీనార్ల, చినతీనార్ల, రాజయ్యపేట, బోయపాడు, అమలాపురం, డీఎల్‌పురం తీర గ్రామాల్లో సీఐ జె.మురళీ, ఎస్ఐ సన్నిబాబు పర్యటించారు. సోమవారం నుంచి బుధవారం వరకూ భారీ వర్షాలు కురిసే ప్రమాదం వుందని, వేటకు వెళ్లొద్దని వారు సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాంబిల్లి: తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లోని ప్రజలకు తుఫాన్ హెచ్చరికలపై తమ సిబ్బంది ద్వారా దండోరా వేయించామన్నారు. మేజర్, మైనర్ శారదా నదుల పరిధిలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాడనర్సాపురం, కొత్తపట్నం, వాడనర్సాపురం, లోవపాలెం, గజిరెడ్డిపాలెం మత్స్యకారులు మరింత అప్రమత్తంగా ఉండడంతో పాటు తమ పడవలు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. అధికారుల నుంచి ఆదేశాలు వచ్చేంతవరకు మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



కోటవురట్ల : చినబొడ్డేపల్లి ఎస్సీకాలనీ వాసులకు బియ్యం సరఫరా చేస్తున్న రెవెన్యూ అధికారులు



అచ్యుతాపురం: పూడిమడక లైట్‌హౌస్ వెనక ప్రదేశానికి చేర్చిన పడవలు

బీచ్ సందర్శన నిషేధం

ఎస్.రాయవరం: తుఫాన్ కారణంగా రేవుపోలవరం సముద్రతీరం సందర్శనను నిషేధించినట్టు ఎస్ఐ విభీషణరావు ఆదివారం తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే ఆ ప్రాంతంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశామన్నారు. తుఫాన్ కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున రేవుపోలవరం సముద్ర తీరం వద్దకు పర్యాటకులు, ప్రజలు వెళ్లకూడదన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి అరగంట సేపు భారీ వర్షం కురిసింది. ఎస్.రాయవరం, అడ్డరోడ్డు, గెడ్డపాలెం గ్రామాల్లో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది.

అధికారులు అలెర్ట్‌గా ఉండాలి

కోటవురట్ల: తుఫాన్ నేపథ్యంలో వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో నివాసం ఉండి అప్రమత్తంగా తహశీల్దార్ తిరుమలబాబు అన్నారు. ఆదివారం వీఆర్‌వోలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైన నివాసం ఉండడానికి ప్రజలు ఇబ్బంది పడితే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. చినబొడ్డేపల్లి ఎస్సీకాలనీలో నివాసం ఉంటున్న లోకవరపు అప్పన ఇంటి శ్లాబ్ బలహీనంగా ఉండడంతో ఆ కుటుంబీకులను సురక్షిత ప్రాంతానికి తరలించామన్నారు. ఆ కుటుంబానికి రేషన్ పంపిణీ చేశామన్నారు. ఎస్సీకాలనీలో 16 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు. వర్షాలు కురిసే సమయంలో ప్రజలు బయటకు రావద్దని హెచ్చరించారు. చెట్టు కింద ఉండవద్దని సూచించారు.

కూటమి ప్రభుత్వంలో రోడ్లకు మహర్దశ

- నియోజకవర్గంలో రూ.14.6 కోట్లతో రహదారులు
- నిధులు మంజూరు చేయించిన హోం మంత్రి అనిత

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో నియోజకవర్గంలోని రోడ్లకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నియోజకవర్గం అభివృద్ధికి భారీగా నిధులను మంజూరు చేయిస్తున్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో ఒక్క రోడ్డు కూడా నిర్మించలేదు. కనీసం గోతులు కూడా పూడ్చకపోవడంతో ప్రజలు రోడ్లపై ప్రయాణాలు చేయడానికి నానా అవస్థలు పడేవారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పల్లె పండగ పేరుతో గ్రామాలలో కోట్లాది రూపాయలతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. నియోజకవర్గంలోని పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.14.6 కోట్లు మంజూరయ్యాయి. దీంతో తుని నుంచి పాల్తేరు రోడ్డు, ఈదటం-పాల్మన్ పేట- వెంకటనగరం రోడ్లకు మోక్షం కలగనుంది. ఇవి కాకుండా మండలంలో పలు రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పాయకరావుపేట నుంచి మంగవరం వరకు పెంటకోట రోడ్డు ధ్వంసమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర హోం మంత్రి ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కోటి రూపాయలను మంజూరు చేశారు. ఇటీవల రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. అదేవిధంగా ఎన్నో ఏళ్లగా గుంటపల్లి నుంచి ఒడ్డిమెట్ట మీదుగా హైవేకు వెళ్లే రోడ్డు గోతుల మయంగా మారింది. దీని నిర్మాణానికి రూ.85 లక్షలు మంజూరు చేశారు. మండలంలోని రోడ్ల నిర్మాణానికి హోం మంత్రి అనిత భారీగా నిధులు మంజూరు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రూపురేఖలు మారనున్న అరట్లకోట వద్ద ధ్వంసమైన రోడ్డు

తొలి కార్తీక సోమవారానికి పంచదార్ల ముస్తాబు

- వేకువజాము నుంచి పూజలు
- మార్మోగనున్న శివనామ స్మరణ

రాంబిల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మహోత్సవాలు సందర్భంగా ఈ నెల 27న తొలి సోమవారం ప్రముఖ శైవక్షేత్రం పంచదార్ల భక్తుల శివనామ స్మరణతో మార్మోగనుంది. వేకువజాము నుంచి పంచదార్లలో పూజలు ప్రారంభమవుతాయి. ఆలయం ప్రాంగణంలోని ఆకాశ దార వద్ద భక్తులు కార్తీక స్నానాలు ఆచరిస్తారు. అనంతరం ఫణిగిరిపై కొలువై ఉన్న ఉమాధర్మలింగేశ్వరస్వామివారిని దర్శించి పూజలు చేయనున్నారు. ఆలయ ఆవరణలో కొలువైన సహస్రలింగేశ్వరస్వామి, రాధామాధవస్వామి, ద్విముఖ వినాయక స్వామి, సాయిబాబాలను భక్తులు దర్శించి పూజలు చేయనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్టు ఎండోమెంట్ అధికారులు తెలిపారు. దిమిలి, వెల్చూరు, లాలంకోడూరు, కొత్తపట్నం గ్రామాల్లోని శివాలయాలను కూడా భక్తులు దర్శించి పూజలు చేయనున్నారు.



స్వచ్ఛతా కార్యక్రమం

పంచదార్ల పుణ్యక్షేత్రం ఆవరణలో ఆదివారం స్వచ్ఛతా కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు. ఆలయం నిర్వహణాధికారి తేజ పిలుపు మేరకు భక్తులు ఉమాధర్మలింగేశ్వరస్వామి వారి ఆలయం చుట్టూ ఉన్న తుప్పలను తొలగించారు. రాధామాధవస్వామి ఆలయ గర్భంలో ప్రవహిస్తున్న ఐదు ధారలు వద్ద పేరుకుపోయిన చెత్త, పేరుకుపోయిన నిల్వ నీటిలను తొలగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఉరిటి నారాజీ, ధూళి ధర్మరాజు,శివపాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి హ్యాపీ సండే : చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ప్రతి వారం ప్రతీ వార్డులో హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. ఆదివారం కొక్కిరాపల్లి వార్డులో కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ పర్యవేక్షణలో హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమాకుమారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అన్ని విధాలా ప్రోత్సహించాలన్నారు. తహశీల్దారు వరహాలు మాట్లాడుతూ వినూత్నమైన ఈ కార్యక్రమం చిన్నారులకు ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామజ్యోతి యువత ప్రతి వారం సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న వారిని అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన డాన్స్, పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, గ్రామస్థులు మజ్జి రాంబాబు, పెయ్యల రామకృష్ణ గ్రామజ్యోతి యువత పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



వేంకటేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయకుమార్, నాయకులు

వేంకటేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన

ఎలమంచిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ యర్రవరంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ పిట్టా శ్రీను దంపతులు పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, నేతలు హాజరయ్యారు. కార్యక్రమంలో కూటమి నేతలు బొద్దపు శ్రీను, పిట్టా శ్రీను, రాజాన శేషు, కరణం రవి, బొద్దపు శ్రీనివాసరావు, మోటారు గోపీ, సియ్యాద్రి శ్రీను, చిట్టిబాబు, సేనాపతి తులసీరామ్, సేనాపతి రాజా మహేష్, యువకులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పోరాటానికి న్యాయవాదుల సంఘీభావం

నక్కపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజయ్యపేటలో మత్స్యకారుల చేస్తున్న బల్క్‌డ్రగ్ పార్కు ఆందోళనకారులకు పలువురు హైకోర్టు న్యాయవాదులు సంఘీభావం ప్రకటించారు. ఆదివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ కేంద్ర పరిపాలనా కమిటీ అధ్యక్షుడు సుంకర రాజేంద్ర ప్రసాద్, పిఠాపురం న్యాయవాదుల సంఘం ప్రతినిధులు భాస్కరాచార్యులు, విశాఖ న్యాయవాదులు అల్లు సురేశ్, నూకల వెంకటేశ్వరరావు తదితరులు రాజయ్యపేట మత్స్యకారులకు మద్దతు ప్రకటించారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటైతే కలిగే నష్టాల గురించి సుంకర రాజేంద్రప్రసాద్‌కు జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ, శీరం నర్సింహమూర్తి వినతిపత్రం సమర్పించారు.



సుంకర రాజేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

'వారాల పాటు గృహ నిర్బంధాలు చట్ట విరుద్ధం'

ఎస్.రాయవరం: ఎవరైనా నేరం చేస్తారనే అనుమానం కలిగితే ఒక రోజు తప్ప వారాల తరబడి ఏ వ్యక్తినీ నిర్బంధించమని ఏ చట్టంలోను లేదని హైకోర్టు న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం మధ్యాహ్నం ధర్మవరం అగ్రహారంలోని సీపీఎం నాయకుడు ఎం.అప్పలరాజు, కుటుంబ సభ్యులను న్యాయవాదుల బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బల్క్‌డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేయొద్దంటూ పోరాటం చేస్తున్న మత్స్యకారులకు మద్దతిస్తున్న అప్పలరాజును పోలీసులు రెండు వారాలుగా గృహ నిర్బంధంలో ఉంచి తీవ్రమైన తప్పు చేస్తున్నారన్నారు.

తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

- తుఫాన్ జిల్లా ప్రత్యేక అధికారి వినయ్‌చంద్

నక్కపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని తుఫాన్ జిల్లా ప్రత్యేక అధికారి వినయ్‌చంద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఇక్కడి మండల అధికారులతో వినయ్‌చంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్‌కు సంబంధించి కంట్రోల్ రూమ్ ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. తుఫాన్ కారణంగా ఎటువంటి నష్టాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహమూర్తి, తదితర అధికారులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారుల ఆందోళన

అచ్యుతాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి వద్ద బల్క్‌డ్రగ్ పార్కును తాము వ్యతిరేకిస్తున్నామని పూడిమడక మత్స్యకారులు తెలిపారు. ఆదివారం రాజయ్యపేట మత్స్యకారులకు సంఘీభావం తెలుపుతూ వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక ఆర్థిక మండలి రాకతో పూడిమడక మత్స్యకారులు కాలుష్య కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతున్నారన్నారు. సెజ్ వచ్చిన తర్వాత ఉపాధి అవకాశాలు మాటుంచితే తమ జీవనోపాధికే విఘాతం కలిగిందన్నారు. కర్మాగారాల్లో వ్యర్థాలు సముద్రంలో కలియడంతో చేపలు చనిపోయి జీవనోపాధికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మిడి అప్పారావు, వి. శ్రీనివాసరావు, చోడిపల్లి అప్పారావు, చేపల శ్రీరాములు, ఎం. చినరాజు, రేవిడి ఆనందరావు పాల్గొన్నారు.

పొంచి ఉన్న 'మొంథా' ముప్పు

... 5వ పేజీ తరువాయి

చేశారు. సోమవారం నుంచి బుధవారం వరకు అన్ని యాజమాన్యాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఈ ఆదేశాలను ఉల్లఘించి ఎవరైనా విద్యా సంస్థను తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. ఉద్యోగులు తాము పనిచేస్తున్న కేంద్రాల్లోనే ఉండాలని, తుఫాన్ నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. తుఫాన్ సమయంలో భారీ వర్షాలు కురిసి చెరువులు, కాలువల గట్లకు గండ్లు పడే అవకాశం వుందని, అదే విధంగా రిజర్వాయర్లకు వరద పోటెత్తి గేట్లు ఎత్తితే దిగువ ప్రాంతాలు ముంపునకు గురవుతాయని, అందువల్ల నదుల తీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఇళ్లు, ఇతర ఆస్తులకు నష్టం వాటిల్లితే వెంటనే మండల కేంద్రాల్లోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం వచ్చేలా గ్రామస్థాయిలో సిబ్బంది ప్రజలకు అందుబాటులో వుండాలన్నారు. రానున్న మూడు, నాలుగు రోజుల్లో ప్రసవం అయ్యే అవకాశం గర్భిణులను ముందుగానే సమీపంలోని ఆస్పత్రుల్లో చేర్పించాలని చెప్పారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని, ఒకవేళ ఇప్పటికే ఎవరైనా సముద్రంలో వేటకు వెళ్లి ఉంటే వెంటనే తీరానికి వచ్చేలా చూడాలని మత్స్య, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులకు సూచించారు. తుఫాన్ ధాటికి పడవలు కొట్టుకుపోకుండా వుండడానికి మత్స్యకారులు తమ పడవలను తీరానికి దూరంగాచేర్చి, తాళ్లతో చెట్లకు కట్టివేశారు. విపత్కర పరిస్థితుల్లో సముద్ర తీర గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించడానికి తుఫాన్ రక్షిత భవనాలతోపాటు విద్యా సంస్థల భవనాలను సిద్ధం చేశారు.

ఇంగ్లండ్ జోరు

... 5వ పేజీ తరువాయి

అమీ జోన్స్ 75 బంతుల్లో 5 బౌండరీలు, 1 సిక్సర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేసింది. మరో ఓపెనర్ టామీ బ్యూమౌంట్ 40 పరుగులు చేసి తహు బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా అవుటైంది. హీదర్ నైట్ (33; 2 ఫోర్లు, 1 సిక్సర్) చెలరేగింది. అప్పటికే వికెట్ల ముందు పాతుకుపోయిన అమీ జోన్స్ రోజ్‌మెయిర్ బౌలింగ్‌లో మిడ్ వికెట్, మిడాఫ్ మీదుగా వరుసగా రెండు ఫోర్లు బాది మ్యాచ్‌ను ముగించింది.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన న్యూజిలాండ్ 38.2 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. టాప్ ఆర్డర్‌లో జార్జి ఫ్లిమ్మర్ (43), అమెలియా కెర్ (35), కెప్టెన్ సోఫీ డివైన్ (23) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. మ్యాచ్ ఎనిమిదో ఓవర్‌లో స్మిత్ బౌలింగ్‌లో అమెలియా కెర్ (35) బ్యాక్‌వర్డ్ పాయింట్, స్క్వేర్ లెగ్, మిడాఫ్, కవర్స్ మీదుగా వరుసగా నాలుగు బౌండరీలు బాది ఊపుమీద కనిపించినా తర్వాత ఓవర్‌లో క్యాప్సీ బౌలింగ్‌లో డీన్ క్యాచిచ్చి అవుటవడంతో మిగిలిన బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఇంగ్లండ్ బౌలర్లలో లిన్సీ స్మిత్ మూడు వికెట్లు పడగొట్టగా...బ్రంట్, కాప్సీ చెరో రెండు వికెట్లు...సోఫీ, చార్లీ డీన్ చెరో వికెట్ తీశారు.

భూతల నరకం!

... 5వ పేజీ తరువాయి

దెబ్బతింటున్నాయని యజమానులు, డ్రైవర్లు వాపోతున్నారు. బీఎన్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి.. ఉన్నతాధికారులకు చెప్పినా ఫలితం లేకపోయింది.

వడ్డాది- తాటిపర్తి మధ్య..

వడ్డాది- పాడేరు ఆర్అండ్‌బీ రోడ్డులో వడ్డాది నుంచి మాడుగుల మండలం తాటిపర్తి వరకు 15 కిలోమీటర్ల మేర రహదారి పలుచోట్ల పూర్తిగా ధ్వంసమైంది. పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, హుకుంపేట మండలాల ప్రజలు మాడుగుల, చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు రావాలంటే ఈ మార్గంలోనే ప్రయాణించాలి. కానీ పలుచోట్ల ఏర్పడిన భారీ గోతులు, ఛిద్రమైన రహదారి కారణంగా అన్ని రకాల వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.

ప్రతిపాదనల్లోనే నాలుగు లేన్ల రహదారి

బీఎన్ రోడ్డును పీపీపీ విధానంలో నాలుగు లేన్ల రహదారిగా విస్తరించాలని ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. ఈ రహదారి అభివృద్ధి బాధ్యతను ఈసీసీ అనే కంపెనీకి అప్పగించారు. కానీ డీపీఆర్ తయారు కాకపోవడంతో పనులు మొదలుకాలేదు. నాలుగు లేన్ల రోడ్డు కాగితాలకే పరిమితమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

నూకాంబిక ఆలయంలో భక్తుల సందడి

▸▸ వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కుటుంబాలతో రాక

అనకాపల్లి టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దర్శనాలు కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కుటుంబాలతో సహా విచ్చేసి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణతో పాటు పరిసరాల్లోని కల్యాణ మండపాలు, తోటల్లో భక్తులు వంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ఆరగించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బాలాలయంలో అమ్మవారు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

సెలవొస్తే.. ఇంతేనా సారూ...

▸▸ అనకాపల్లి పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే ▸▸ బాలాజీరావుపేట జంక్షన్, బండిగాడి వీధి, దల్లివారి వీధి, అరటి పండ్ల మార్కెట్, ఏఎంసీ కాలనీ తదితరాల్లో పరిస్థితి మరింత దారుణం



అధ్వానంగా ఉన్న బండిగాడివీధి రోడ్డు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సెలవు దినం వస్తే చాలు.. పట్టణంలోని రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. ముఖ్యంగా ఆదివారం పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు సండే సెలవు దినం కావడంతో ప్రతి వారం ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఇప్పటికే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతకు ఎంతో ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. పట్టణంలో రోజుకి 70 నుంచి 80 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. సోమవారం రెండు రోజుల చెత్త ఎత్తడానికి కార్మికులు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే సేకరించిన చెత్తను జీవీఎంసీ కార్యాలయ ఆవరణలోని పడేసిన తరువాత దీనిని కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు అరకొరగా తరలిస్తున్నారని పలువురు వాపోతున్నారు. చెత్తాచెదారం వల్ల బాలాజీరావుపేట జంక్షన్, బండిగాడి వీధి, దల్లివారి వీధి, అరటిపండ్ల మార్కెట్, ఏఎంసీ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో రహదారులపై ఏర్పాటు చేసిన డంపర్‌బిన్లు



ఏఎంసీ కాలనీ వద్ద డంపర్‌బిన్ పాడవ్వడంతో రోడ్డుపై ఉన్న చెత్త



అరటిపండ్ల మార్కెట్ వద్ద...

నిండిపోయి చెత్త రోడ్డుపై పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఏఎంసీ కాలనీ ముందు జీవీఎంసీ అధికారులు గతంలో ఏర్పాటు చేసిన డంపర్ బిన్ పూర్తిగా పాడైపోవడంతో అందులో వేసిన చెత్త అంతా రోడ్డు పైకి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడి డంపర్ బిన్‌ను మార్చాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోతోందని అంటున్నారు. పక్కనే చేపల మార్కెట్ ఉండడం వల్ల ఆ వ్యర్థాలు కూడా డంపర్‌బిన్‌లో వేయడంతో దుర్వాసన వెదజల్లుతుందని అక్కడివారు చెపుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులకు అండగా విశాఖ డెయిరీ

▸▸ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ వెల్లడి

▸▸ తుమ్మపాలలో రైతు భవనం నిర్మాణానికి స్థల పరిశీలన



డెయిరీ పార్లర్‌ను ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

తుమ్మపాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులకు విశాఖ డెయిరీ నిత్యం అండగా ఉంటుందని సంస్థ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. తుమ్మపాలలో ఆదివారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో మాట్లాడారు. ప్రధానంగా రైతుల ఆకాంక్ష మేరకు రైతు భవనం నిర్మాణానికి స్థల పరిశీలన చేశామన్నారు. త్వరలో భవన నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం తుమ్మపాలలో విశాఖ డెయిరీ పార్లర్‌ను ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు డెయిరీ చొరవ చూపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కర్రి బాబి, నడిపల్లి గణేశ్, చెక్కల శ్రీనివాసరావు, ఆడారి గోవిందరావు, పీలా తాతునాయుడు, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పలకా రవి, పీలా బుజ్జి, పెతకంశెట్టి బలరాం, పాల సంఘం అధ్యక్షుడు చదరం కాశీ, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలి

▸▸ అనకాపల్లి రూరల్ సీఐ అశోక్ కుమార్ సూచన

▸▸ శారదా నది పరీవాహక గ్రామాల్లో పరిస్థితులు అంచనా



వెంకుపాలెం నది బ్రిడ్జిపై గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

కొత్తూరు, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ పట్ల గ్రామీణ ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి రూరల్ సీఐ అశోక్ కుమార్ సూచించారు. ఆదివారం ఆయన శారదా నది పరీవాహక ప్రాంతాలైన వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, దిబ్బపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. బలమైన ఈదురు గాలులు వీస్తాయని ప్రజలంతా సురక్షితమైన ప్రాంతాల్లో ఉండాలని వివరించారు. తుఫాన్ సమయంలో చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గృహాల వద్ద ఉండరాదన్నారు. ప్రధానంగా శారదా నదిని ఆనుకొని ఉన్న రైతులు తమ పశువులను సురక్షితమైన ప్రాంతాల్లో ఉంచాలన్నారు. నది గట్ల వద్ద ప్రయాణం చేయవద్దని కోరారు. తుఫాన్ సమయంలో శారదా నది ఉధృతంగా ప్రవహిస్తుందని, బలహీనపడిన గట్లను ఎప్పటికప్పుడు పరిశీలించి అత్యవసర సమయాల్లో తమను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి ప్రమాదం ఉన్నా ముందస్తుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు, రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం మామిడిపాలెం, కూండ్రం, కొప్పాక, మారేడుపూడిలలో రెవెన్యూ, నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ, ఎలక్ట్రికల్ తదితర శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఇదిలావుంటే తుఫాన్ నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న తాగునీటి ట్యాంకుల్లో కార్యదర్శులు క్లోరినేషన్ చేయించి, ప్రజలకు అందుబాటులో ఉండాలని డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ ఆదేశించారు. ఆదివారం ఆయన కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం తదితర పంచాయతీల్లో పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు. కొత్తూరు సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న, కార్యదర్శి సుభాష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో పర్యటన నిషేధం : సీఐ మల్లికార్జునరావు

పరవాడ : తుఫాన్ నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల్లో పర్యటనకు అనుమతులు లేవని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు స్పష్టం చేశారు. పర్యాటకులెవరూ బీచ్‌లకు వెళ్లడాన్ని నిషేధించామన్నారు. పోలీసు, రెవెన్యూ, అధికారులు బీచ్‌ల వద్ద నిరంతరం గస్తీ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అలాగే తుఫాన్ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ బి.నాగరాజు తెలిపారు. సహాయం కోసం 08924-247433 నంబరుకు సంప్రదించాలన్నారు.

కళా ఉత్సవ్ పోటీల్లో ఆరిపాక విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థులు

సబ్బవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆరిపాక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయవాడలో ఈ నెల 23, 24 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో చక్కని ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవో-2 రవీంద్రబాబు మాట్లాడుతూ తొమ్మిదో తరగతి చదువుతున్న కె.నీలవేణి, కె.దిలీప్‌లు ఆంగ్ల ఉపాధ్యాయిని బీవీ లక్ష్మి శిక్షణలో సంప్రదాయ బొమ్మల తయారీ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. పోరంకిలో జరిగిన ముగింపోత్సవంలో విద్యా శిక్షణ పరిశోధన మండలి డైరెక్టర్ కృష్ణారెడ్డి మెమెంటో అందజేశారన్నారు.

కల్తీ మద్యాన్ని గుర్తించేందుకు సురక్ష యాప్

▸▸ క్యూర్ కోడ్ చెరిగినా.., లేకపోయినా కొనుగోలు చేయవద్దు

▸▸ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ సూచన

▸▸ అధికారులు, నాయకులతో కలిసి అవగాహన ర్యాలీ

సబ్బవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కల్తీ మద్యాన్ని గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సురక్ష యాప్‌ను తీసుకు వచ్చిందని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అన్నారు. సబ్బవరంలో ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి సురక్ష యాప్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మద్యం దుకాణం వద్దకు వెళ్లి యాప్ పనిచేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం కొనుగోలు చేయాలనుకునే వారు ముందుగా మద్యం బాటిల్‌పై ఉండే బార్ కోడ్‌ను స్కాన్ చేస్తే మద్యం తయారు తేదీ, కంపెనీ, నాణ్యతా ప్రమాణాలు అన్నీ ఉంటాయన్నారు. అదే కల్తీ మద్యం అయితే స్కాన్ చేసినా ఎటువంటి డేటా రాదని స్పష్టం చేశారు. డేటా రాకుంటే అది కల్తీ మద్యంగా గుర్తించి వెంటనే ఎక్సైజ్ శాఖకు లేదా టోల్ ఫ్రీ నంబరు 14405కు సమాచారం అందిస్తే సంబంధిత షాపుపై చర్యలు తీసుకుంటారన్నారు. సురక్ష యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. కల్తీ మద్యంపై వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని ప్రజలను ఆయన కోరారు. వైసీపీ ప్రభుత్వమే మద్యం విక్రయించి, అన్ని రకాల అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. అటువంటి వారు ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతుండడం తగదన్నారు. ఎక్సైజ్ సీఐ డి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ బాటిల్‌పై క్యూఆర్ కోడ్ చెదిరిపోయినా, లేకపోయినా మద్యాన్ని కొనవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండి దేముడు, బొండా సత్యారావు, గండి ముత్యాలనాయుడు, ఆడారి నాగరాజు, కన్నంనాయుడు, అమరపిన్ని నర్సింగరావు, ఎల్లాజీ, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, ఆకుల గణేష్, బలిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సురక్ష యాప్‌పై అవగాహన ర్యాలీలో గండి బాబ్జీ, తదితరులు

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

కశింకోట, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం కూడలి వద్ద జాతీయ రహదారిపై నడుచుకొని వస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం ఎలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సమీపంలో గల ఒక కంపెనీలో పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరికి తీవ్రగాయాలు కాగా, మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. వీరిని స్థానికుల సహాయంతో అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని తెలిసింది. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలియజేశారు.

నర్సింగబిల్లి పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక

కశింకోట, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి) : నర్సింగబిల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1993-94 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్నవారంతా ఓచోట కలవడంతో వారి ఆనందాలకు అవధులు లేదు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్న అనంతరం నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఇకపై ఏటా కలుసుకోవాలని నిర్ణయించారు.



హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

108 వాహనాల కండిషన్ తనిఖీ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలో ఆదివారం 108 అంబులెన్స్‌ల కండిషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, మందుల వాడకం, ఏదైనా ఎమర్జెన్సీ కేసు వచ్చినప్పుడు ఏ రకంగా స్పందించాలి తదితర అంశాలను భవ్య హెల్త్ సర్వీస్ రీజనల్ మేనేజర్ పి.బాలరాజు సిబ్బందికి వివరించారు. వాహనంలో క్షతగాత్రులకు, మహిళలకు ప్రథమ చికిత్స చేసేటప్పుడు ఏ రకంగా చేయాలి, కాల్ సెంటర్‌తో మాట్లాడటం వంటి వాటిపై అవగాహన కల్పించారు. అలాగే జిల్లా ఆసుపత్రి నుంచి కేజీహెచ్‌కు తరలించే కేసుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త లను తెలియజేశారు. ఆయన వెంట జిల్లా మేనేజర్ శ్రీనివాస్, శంకర్ తదితరులు ఉన్నారు.

వైద్య, రక్తదాన శిబిరాలకు విశేష స్పందన



రక్తాన్ని దానం చేస్తున్న యువకులు

సబ్బవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాటజంగాలపాలెం శివారు రాజుగారి బంజరు వద్ద టీడీపీ నాయకుడు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు భరణికాన బాబూరావు కుమారుడు రాజేష్ జయంతి సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రాజేష్ స్మృతివనాన్ని ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు, గండి రవికుమార్ ప్రారంభించి, నివాళులర్పించారు. వీరి చేతుల మీదుగా పది, ఇంటర్, డిగ్రీలలో ప్రతిభ చూపిన యాభై మంది విద్యార్థులకు రూ. ఎనిమిది లక్షలు విలువ చేసే ఉపకార వేతనాలు, పలువురు వృద్ధులతకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరంలో యువకుల నుంచి 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సర్పంచ్ పడాల వెంకటరమణ, భరణికాన రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గండి దేముడు, టీడీపీ మండల అధ్యక్షుడు గండి ముత్యా లనాయుడు, బోకం రామునాయుడు, ఫైల జగన్నాథరావు, నియోజక వర్గంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో సదుపాయాల కల్పనకు సింహాద్రి ఎన్టీపీసీ నిధులు

▸▸ సీఎస్ఆర్ కింద రూ.1.21 కోట్లు కేటాయింపు

▸▸ ఏజీఎం పాత్ర, డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ ఒప్పంద పత్రాలపై సంతకాలు

పరవాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులను మెరుగుపరచడానికి సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా 2025-26 సంవత్సరానికి రూ.1.21 కోట్లు అందించడానికి ముందుకొచ్చింది. సింహాద్రి ఎన్టీపీసీ అడ్మిన్ భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో హెచ్ఆర్ ఏజీఎం బీటీ పాత్ర, అనకాపల్లి డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ నిధులతో జిల్లాలో వేములపూడి, గునుపూడి, చీడిగుమ్మల, నాతవరం, గొలుగొండ, కృష్ణాదేవిపేట పీహెచ్‌సీలతోపాటు నర్సీపట్నంలోని బొంతువీధి, పెదబొడ్డేపల్లి, బలిఘట్టం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య సంరక్షణ పరికరాలు, ఇన్వర్టర్లు, ఏసీలు, ఆపరేషన్ థియేటర్ల ఎల్ఈడీ లైట్లు, ఫర్నీచర్ తదితర సామగ్రిని సమకూర్చనున్నట్టు అధికారులు తెలిపారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి క్రిటికల్ కేర్ బ్లాక్ , డీఈఐసీ భవనాలకు ప్రహరీ గోడలు, సీసీ రహదారుల నిర్మాణం చేపడతామని తెలిపారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న హెచ్ఆర్ ఏజీఎం పాత్ర, డీసీహెచ్ఎస్

20 ఐరెన్ ట్యాబ్లెట్లు మింగేసిన చిన్నారి!

▸▸ సకాలంలో చికిత్స అందడంతో తప్పిన ప్రాణాపాయం

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల చిన్నారి పొరపాటున సుమారు 20 ఐరెన్ ట్యాబ్లెట్లు మింగేసింది. ట్యాబ్లెట్లు లేకపోవడాన్ని గుర్తించిన తల్లిదండ్రులు హుటాహుటిన చిన్నారిని ఆసుపత్రికి తరలించడంతో వైద్యులు అత్యవసర చికిత్స అందించి ఆమె ప్రాణాలు కాపాడారు. మహారాణిపేటలోని ఉమెన్ అండ్ చైల్డ్ మెడికవర్ పీడియాట్రిక్ వైద్యులు సాయి సునీల్ కిషోర్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి ప్రాంతానికి చెందిన చిన్నారి, ఆమె తల్లి ఐరెన్ ట్యాబ్లెట్లు వేసుకోవటం చూసేది. అనుకోకుండా దొరికిన ట్యాబ్లెట్లు చిన్నారి కంటపడడంతో ఒక్కసారిగా మింగేసింది. ఆ సమయంలో తల్లిదండ్రులు లేకపోవటంతో గమనించలేదు. తరువాత వచ్చినవారు పాప అలసటగా శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించారు. ట్యాబ్లెట్లు తినేసినట్లు గుర్తించారు. వెంటనే స్థానిక వైద్యుని వద్దకు తీసుకెళ్లగా ప్రమాదకర పరిస్థితిలో ఉందని, వెంటనే మెరుగైన ఆసుపత్రికి తరలించాలని సూచించడంతో వెంటనే విశాఖలోని మెడికవర్ ఉమెన్ చైల్డ్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ వైద్యులు రక్తపరీక్షలు నిర్వహించి, ఐరెన్ ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు గమనించారు. కాలేయం, ఊపిరితిత్తులు తీవ్రంగా దెబ్బతినటం ప్రారంభించాయి. ఆక్సిజన్ సహాయంతో వెంటిలేటర్ ద్వారా చికిత్స ప్రారంభించారు. కీలేషన్ థెరపీ ద్వారా తొలుత రక్తంలో ఐరెన్‌ను తొలగించారు. నిరంతర వైద్య పర్యవేక్షణలో చికిత్స అందించిన వైద్యులు చిన్నారి పూర్తిగా కోలుకోవటంతో ఆదివారం డిశ్చార్జి చేశారు. చిన్నారి పూర్తి ఆరోగ్యంతో ఇంటికి వెళ్లడం ఆనందంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.



చికిత్స పొందిన చిన్నారితో వైద్య బృందం

మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దు: ఏఐఎస్ఎఫ్



ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పాడేరురూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయవద్దు అని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లవరాజు, నాసార్జీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజన, పేద విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి లేకుండా పాలన సాగిస్తుందని విమర్శించారు. పీపీపీ విధానంతో పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేస్తోందన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ కోట్లాది రూపాయలను విడుదల చేయకుండా మోసం చేస్తుందన్నారు. గిరిజన ఆశ్రమాల్లో విద్యార్థులు వందలాది మంది రోగాల బారిన పడి మృతి చెందుతున్నా హెల్త్ అసిస్టెంట్లను నియమించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు మెస్ బిల్లులు పెంచాలన్నారు. మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నడిపి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఫణీంద్ర, కుళాయిస్వామి, నాగభూషణం, మస్తాన్, కృష్ణ, తనిశ్, జగదీష్ పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సభ్యత్వ నమోదు

పాడేరురూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ గిరిజన శాశ్వత ఉద్యోగి నవంబరు 25వ తేదీ లోగా రూ. 200 సభ్యత్వం చెల్లించి భారత గిరిజన ఉద్యోగుల సంఘ సభ్యత్వాన్ని పొందాలని జిల్లా ముఖ్య ఎన్నికల అధికారి పలాసి కృష్ణారావు కోరారు. ఉద్యో గుల సంఘం కొత్త కార్యవర్గం ఎన్నికకు విస్తృతంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు 12 మంది ఎన్నికల అధికారులను నియమించామన్నారు. ఎన్నికల అధికారులు సమావేశం అనంతరం సభ్యత్వ నమోదుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులు సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. సభ్యత్వం పొందిన ఉద్యోగులు మాత్రమే ఎన్నికల్లో ఓటు వేసే అర్హతను పొందుతారన్నారు. సందేహాలుంటే ఎన్నికల అధికారులు జీవీవీ ప్రసాద్, కిల్లు గంగన్నపడాల్‌ను సంప్రదించాలన్నారు.

భీమిలి బీచ్‌ను సందర్శించిన అరకు ఎమ్మెల్యే



స్నేహితులతో కలిసి బీచ్‌లో ఎమ్మెల్యే మత్స్యలింగం

భీమునిపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌ను అరకు ఎమ్మెల్యే ఆర్. మత్స్యలింగం ఆదివారం సాయంత్రం సందర్శించారు. తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన తన స్నేహితులతో కలిసి ఆయన బీచ్‌కు వచ్చారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు సందర్శకులను బీచ్‌లోకి అనుమతించడం లేదు. ఎమ్మెల్యే, తాము సుదూర ప్రాంతం నుంచి వచ్చామని, తీరంలో ఒక ఫొటో తీసుకుంటే గుర్తుగా ఉంటుందని మెరైన్ సీఐ శ్రీనివాసరావును కోరడంతో ఆయన అంగీకరించారు.

కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేయాలి



సమావేశంలో ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు

చింతపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ని గిరిజన ప్రాంతంలోనే ఏర్పాటు చేసి ఆదివాసీలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని స్థానిక ఎంపీపీ కోరాబు అను షదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. జీసీసీ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ని నర్సీపట్నం నియోజకవర్గం మాకవరంపాలెం మండలం శెట్టిపాలెం లో నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అలాగే, శెట్టిపాలెంలో నిర్మిస్తున్న కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌లో కేవలం నర్సీపట్నం నియోజవర్గ మహిళలకు మాత్రమే ఉపాధి కల్పించాలని సభాపతి అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

బ్యాంకులో షార్ట్‌సర్క్యూట్.. సామగ్రి దగ్ధం



మంటలు ఆర్పిన దృశ్యం

జి.మాడుగుల, అక్టో బరు 26 (ఆంధ్రజ్యో తి): స్థానిక యూనియన్ బ్యాంకులో షార్ట్‌సర్క్యూట్‌కు మంటలు రేగి కంప్యూటర్, ఏసీ తదితర సామగ్రి దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం మే రకు.. ఆదివారంసాయంత్రం కరెం ట్ షార్ట్‌సర్క్యూట్ జరిగి బ్యాంకులో మంటలు చెలరేగాయి. స్థానికులు అప్రమత్తమయ్యారు. సెక్యూరిటీ సిబ్బందితో కలసి ఫైర్‌సిలిండర్లు వినియోగించి మంటలు అదుపు చేశారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

30 రోజులు .. 100 ప్రసవాలు

»అల్లూరి జిల్లాలో రికార్డు సృష్టించిన చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి

» వైద్యులను అభినందించిన ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్

చింతూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ముప్పైరోజుల్లో 100 ప్రసవాలు జ రుపుకుని అల్లూరి జిల్లాలో చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ ఆదివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, గైనకాలజిస్టులు రమణారావు, శశికళలను అభినందించారు. ప్రసవంలో ఏ సమస్య ఉన్నా ఇక్కడ నుంచి తెలంగాణలోని భద్రాచలం ఏరియా ఆసుపత్రికితరలించేవారు. ఈ క్రమంలో గర్భిణీతో సహా ఆయా కుటుంబాలుఅవస్థలు పడాల్సి వచ్చేది. ఒక్కోమారు ప్రాణాంతక పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చేది. పలు సందర్భాల్లో పరిస్థితి విషమించడం అక్కడి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి రావడంతో పేద, ఆదివాసీ కుటుంబాలు అప్పుల పాలైన సందర్భాలున్నాయి. ఈ స్థితిలో చింతూరు ఆసుపత్రిని ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయడం, అలాగే, ప్రత్యేక వైద్య నిపుణులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రధానంగాఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి స్వయంగా అనస్థీసియా (మత్తు మందు వైద్యుడు) కావడం, ఇద్దరు గైనకాలజిస్టుల నియామకంతో ప్రసవ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో గర్భిణులను తెలంగాణకు తరలించాల్సిన అవసరం దాదాపు లేకుండా పో యింది. ఇటీవల ప్రసవాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో బృందం ప్రత్యేక దృష్టిని సారించింది. మరోవైపు సాధారణ కాన్పులకు ప్రాధా న్యం ఇస్తు న్నారు. నవజాతి శిశు కేంద్రం (ఎస్ఎన్‌సీయూ) ఏర్పాటుచేసి ప్రత్యేక వైద్య నిపు ణుడిని నియమించడంతో శిశుమరణాల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరిలో 64, ఫిబ్రవరి 48, మార్చి 50, ఏప్రిల్ 68, మే 48, జూన్ 54, జూలై 50, ఆగస్టు 92, సెప్టెంబరు 95, ఇక, సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 26వరకు ముప్పై రోజుల్లో 100 ప్రసవాల టార్గెట్‌ను సాధించి జిల్లా రికార్డును సొంతం చేసుకుంది. ఉన్నతాధికారుల నుంచి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది అభినందనలు అందుకున్నారు.



చింతూరు ఆసుపత్రిలో ప్రసవాల వార్డు

గిరిజనుల గుండెల్లో ఆరాధ్య దైవంగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే దేముడు

»10వ వర్ధంతి సభలో వక్తలు

కొయ్యూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సమస్యలకు సత్వర పరిష్కారం చూపి గిరిజనుల గుండెల్లో ఆరాధ్య దైవంగా చింతపల్లి దివంగత మాజీ ఎమ్మెల్యే దేముడు నిలిచారని వక్తలు పేర్కొన్నారు. చింతపల్లి గొడ్డేటి దేముడు 10వ వర్ధంతిని ఆదివారం వెలగలపాలెంలో కుటుంబ సభ్యురాలు, అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేముడు స్మృతివనం స్మారక మందిరంలోని కాంస్య విగ్రహానికి, శరభన్నపాలెంలో ఉన్న దేముడు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ దేముడు చిం తపల్లి, పాడేరు నియోజకవర్గాల ఎమ్మెల్యేగా పేద, బడుగు బలహీన వర్గాల సమానంగా ప్రాధాన్యత ఉండాలనే తపనతో పని చేశారన్నారు. గిరిజనులకు సేవలందించి వారి గుండెల్లో శాశ్వత ముద్ర వేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం దేముడు భార్య చెల్లయ్యమ్మ చేతుల అ న్నదాన కార్యక్రమం నిర్వహింప చేశారు. శరభన్నపాలెం గ్రామం నుంచి ర్యాలీగా కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి దేముడుకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇరవాడ దేముడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి రామునాయుడు, జిల్లా రైతు సం ఘం జిల్లా కార్యదర్శి కనకరాజు, వ్యవసాయ కార్మిక సంఘనేత వియ్యపు నానాజీ,డౌనూరు ఎంపీటీసీ బిడజాన అప్పారావు, నేతలు రామ్మూర్తి, సీలాపు సూరిబాబు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



దేముడు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు, అభిమానులు

'ధారకొండను కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి'



ధారకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

సీలేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని ధారకొండ పరిధిలోని నాలుగు పంచాయతీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకరి విష్ణుమూర్తి మాట్లాడుతూ అన్ని విధాలుగా వెనుకబడి ఉన్న ధారకొండను మండల కేంద్రంగా ప్రకటిస్తే విద్య, వైద్య, ఆర్థిక పరంగా ఎదగడానికి వీలవుతున్నారు. సీలేరు, దుప్పులవాడ, గుమ్మిరేవు ల, ధారకొండ, గాలికొండ, అమ్మవారిధారకొండ ఆరు పంచాతీలను ధారకొండ మండలంలో చేర్చినట్లయితే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ అంశంపై త్వరలోనే అమరావతి వెళ్లి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను కలసి వివరిస్తామన్నారు. ధారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సాధన కమిటీ సభ్యులు శోభ జగన్, దుమంతి ధార ఈశ్వరరావు, కారే శ్రీనివాస్, టీడీపీ నాయకులు పోతురాజు కృష్ణ, ధారకొండ ఎంపీటీసీ సభ్యుడు మాడి రామన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం

» పోలీసు స్టేషన్‌లో టీడీపీ నేతల ఫిర్యాదు



ఎస్ఐ గోపాలరావుకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

అరకులోయ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై త ప్పుడు ప్రచారం చేస్తున్న ఎక్స్ ఖాతాదారునిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలుగుదేశం నేతలు ఆదివారం ఫిర్యాదుచేశారు. ఎస్ఐ గోపాలరావు అందించిన వివరాలివి.. ఎక్స్‌లో ఖాతా ద్వారా ఓ వ్యక్తి పక్క రాష్ట్రానికి సం బంధించిన ఒక స్కూల్ వీడియోను అరకులోయకు సంబంధించినదిగా 18వతేదీన పోస్టు చే శారు. దీనిపై టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పాంగి రాజు, నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ పోస్టులో ఆ వ్యక్తి ముఖ్యమంత్రిపై తప్పుడు ప్ర చారం చేయడమే కాకుండా అనుచిత పదజాలం, అసభ్యకర ఫొటోను పోస్టు చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. తన పోస్టు ద్వారా ప్రజల శాంతికి భంగం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారని ఆరోపించారు. ఈ పోస్టును డిలిట్‌చేసేలా ఎక్స్ సంస్థకు లేఖ రాస్తామని, పోస్టు చేసిన వ్యక్తిపై చట్టపరం గా చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు ఉపసర్పంచ్ చందూవిజయనిర్మల, టీడీపీ డుంబ్రిగుడ మండల అధ్యక్షుడు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్‌ను అటవీశాఖకు అప్పగించవద్దు

» ఉరితాళ్లతో గిరిజనుల వినూత్న నిరసన

అరకులోయ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాడగడసన్‌రైజ్ వ్యూపాయింట్‌పై గిరిజనులు తమ ఉపాధి పోగొట్టవద్దంటూ ఆదివారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్‌ను ఎకో టూరిజం ప్రాజెక్టు కింద అటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధిచేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే, నాలుగేళ్లుగా మాడగడ, పకనగుడ గ్రామాల గిరిజనులు సుమారు 600 మందికిపైగా సన్‌రైజ్‌వ్యూపాయింట్ వద్ద పలు దుకాణాలను ఏర్పాటుచేసుకుని జీవనోపాధి సాగిస్తున్నారు. పర్యాటకులు సన్‌రైజ్‌వ్యూపాయింట్‌ను అధిక సంఖ్యలో సందర్శిస్తున్నారు. అయితే, ఈ సన్‌రైజ్‌వ్యూపాయింట్ అటవీశాఖ ఆధీనంలోకి వస్తుందని, తామే దీనిని నిర్వహిస్తామని ఆ శాఖ ముందుకు వచ్చింది.ఈ స్థితిలో ఎకో టూరిజం ప్రాజెక్టు పెట్టి తమకు లేకుండా చేయడం భావ్యం కాదంటూ ఆయా గ్రామాల గిరిజనులు ఆదివారం ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచించి గ్రామపంచాయతీ నేతృత్వంలో కొనసాగించాలని ఈసందర్భంగా డి మాండ్ చేశారు.



ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న మాడగడ గ్రామస్థులు

ఆకట్టుకున్న పోలీసు ఓపెన్ హౌస్

ముంచంగిపుట్టు, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు.వివిధ రకాల ఆయుధాలను విద్యార్థులకు చూపారు. నేరాల నియంత్రణకు సాంకేతిక పరికరాలు, నేర దర్యాప్తులో తీసుకునే చర్యలను విద్యార్థులకు వివరించారు. దేశభద్రతకు ప్రతి ఒక్కరూ సహకారాన్ని పోలీసులకు అందించాలని ఎస్ఐ కోరారు. సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ, పోలీసులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టుటో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

జి.మాడుగుల: పోలీసు సేవలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక సీఐ బి. శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు పోలీసులు పోలీసు స్టేషన్ ద్వారా ప్రజలకు అందించే సేవలు, ఆయు ధాలను వివరించారు. ఈసందర్భంగా సీఐ మా ట్లాడుతూ పోలీసులు శాంతి భద్రత కాపాడేందుకు పోలీసులు ఎంతో శ్రమిస్తారన్నారు. ఎస్ఐ షణ్ముఖరావు, పోలీసులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ షణ్ముఖరావు

పెదబయలు: స్థానిక కేజీబీవీ విద్యార్థినులకు పోలీసు స్టేషన్‌లో నిర్వహించారు. స్థానిక ఎస్ఐ కొల్లి రమణ వివరించారు. స్టేషన్‌లో విధులు, చట్టాలపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

30న గిరిజన హక్కుల పరిరక్షణపై సభ

సీలేరు, అక్టోబరు 26 , (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ హక్కులు , చట్టాల పరిరక్షణపై ఈ నెల 30 న మారేడుమిల్లిలో నిర్వహించనున్న సభను గిరిజనులు విజయవంతం చేయాలని జీకేవీధి మండలం గిరిజన సమాఖ్య కార్యదర్శి పాంగి నాగేశ్వరరావు కోరారు. ఆదివారం జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధి గంగవరంలో గిరిజనులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1/70 చట్టం అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ప్రభుత్వాలు మారినా గిరిజన ఆదివాసీలు దోపిడీకి గురవుతూనే ఉన్నారన్నారు. ఆదానీ, అంబానీలకు అనుకూలంగా 51,13,2 జీవోలు తెచ్చారన్నారు. బాక్సైట్, లేటరైట్, హైడ్రో ప్రాజెక్టులకు అడవులను అమ్మేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న సభకు అందరూ తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు.



గంగవరంలో ఆవిష్కరిస్తున్న గిరిజన సమాఖ్య నేత పాంగి నాగేశ్వరరావు తదితరులు

తుఫాన్‌పై రైతులు అప్రమత్తం

చింతపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌పై గిరిజన రైతులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఏవో టి. మధుసూదనరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 29 వరకు జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం ఉంటుందన్నారు.ఈ నాలుగు రోజులూ వరి కోతలు చేపట్టరాదన్నారు. పొలాల్లో వర్షపు నీటిని 48గంటల పాటు నిలువ ఉండకుండగా చూసుకోవాలన్నారు.

నీటిని తొలగించిన తర్వాత పంటకు రెండు శాతం యూరియాగాని, పొటాషియం నైట్రేట్‌గాని పిచికారీ చేయాలన్నారు. లేకుంటే అధిక తేమలో కాండం కుళ్లు, వేరుకుళ్ల తెగులు, గింజ బూజు తెగులు రావడానికి అవకాశం ఉందన్నారు.

ఈ తెగుళ్ల నివారణకు కార్బండిజం 2-3గ్రామాలు లేదా, మెటలాక్సిల్ 35శాతం రెండు గ్రామాలు లీటరు నీటిలో కలిపి చల్లాలని కోరారు.

ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి: తహశీల్దార్

గూడెంకొత్తవీధి: మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని తహశీల్దార్ అన్నారావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాగల మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. అత్యవసర సమయాల్లో సహాయం కోసం రెవెన్యూ కార్యాలయం కాల్ సెంటర్‌కి కాల్ చేయాలన్నారు. వీఆర్వోలు, వీఆర్ఏలు, వైద్యసిబ్బంది అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

కొయ్యూరు:మొంథా తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు కోరారు. ఆదివారం నుంచి 29వ తేదీ వరకు బంగాళాఖాతంలో తీవ్ర తుపాను ఏర్పడనుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసినందున భారీ వర్షాలతో కూడిన బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందన్నారు. ము ఖ్యంగా చెరువులు, వాగులు జలపాతాలు తదితర ప్రదేశాలకు వెళ్లకుండా ఉండాలన్నారు. రాత్రి సమయాలలో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సిఐ సూచించారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే 94409 04218, 94409 04241, 94409 04217 నంబర్లుకు సంప్రదించాలని కోరారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రతి కుటుంబానికీ ఆదా



మాట్లాడుతున్న కోశాధికారి నాగేశ్వరరావు

అనంతగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జీఎస్టీతో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ. 15వేలు ఆదా కలిగిందని టీడీపీ అరకు పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కిల్లోగుడ మాజీ సర్పంచి లక్ష్మి ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వ కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వం హయాంలో నిత్యావసర ధరలు ఆకాశాన్నడంతో పేదలు జీవనం కష్టమైందన్నారు. ఈ స్థితిలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దన్నేరావు. టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

గిరిజనుల శ్రమదానం

» మార్గ మధ్యలో బండరాయి , తుప్పల తొలగింపు



వేంగడ-భైరాడివలస మార్గంలో బండరాయిని తొలగిస్తున్న గిరిజనులు

అనంతగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండు గ్రామాల గిరిజనులు శ్రమదానంతో రహదారిని రాకపోకలకు వీలుగా మార్చారు. మండలంలోని వేంగడ పంచాయతీ కేంద్రం నుంచి భైరాడివలస వెళ్లేమార్గమధ్యంలో వర్షాలకు కొండ పైనుంచి బండరాయి జారుకుంటూ రోడ్డుపై వచ్చింది. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లేందుకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం వేంగడ, గద్యవలస గ్రామస్థులు ముందుకు వచ్చి, బండరాయిని తొలగింపు చర్యలు చేపట్టడమే కాకుండా సుమారు 5 కిలో మీటర్ల రోడ్డుకు ఇరు వైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీమ, సేల్స్ మన్ గోవింద్, ఎం.రాము, మత్స్యరాజు, భీమన్న, లక్ష్మణ్, పాల్గొన్నారు.

పొంచి ఉన్న 'మొంథా' ముప్పు

... 5వ పేజీ తరువాయి

చేశారు. సోమవారం నుంచి బుధవారం వరకు అన్ని యాజమాన్యాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఈ ఆదేశాలను ఉల్లఘించి ఎవరైనా విద్యా సంస్థను తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. ఉద్యోగులు తాము పనిచేస్తున్న కేంద్రాల్లోనే ఉండాలని, తుఫాన్ నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. తుఫాన్ సమయంలో భారీ వర్షాలు కురిసి చెరువులు, కాలువల గట్లకు గండ్లు పడే అవకాశం వుందని, అదే విధంగా రిజర్వాయర్లకు వరద పోటెత్తి గేట్లు ఎత్తితే దిగువ ప్రాంతాలు ముంపునకు గురవుతాయని, అందువల్ల నదుల తీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఇళ్లు, ఇతర ఆస్తులకు నష్టం వాటిల్లితే వెంటనే మండల కేంద్రాల్లోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం వచ్చేలా గ్రామస్థాయిలో సిబ్బంది ప్రజలకు అందుబాటులో వుండాలన్నారు. రానున్న మూడు, నాలుగు రోజుల్లో ప్రసవం అయ్యే అవకాశం గర్భిణులను ముందుగానే సమీపంలోని ఆస్పత్రుల్లో చేర్పించాలని చెప్పారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని, ఒకవేళ ఇప్పటికే ఎవరైనా సముద్రంలో వేటకు వెళ్లి ఉంటే వెంటనే తీరానికి వచ్చేలా చూడాలని మత్స్య, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులకు సూచించారు. తుఫాన్ ధాటికి పడవలు కొట్టుకుపోకుండా వుండడానికి మత్స్యకారులు తమ పడవలను తీరానికి దూరంగాచేర్చి, తాళ్లతో చెట్లకు కట్టివేశారు. విపత్కర పరిస్థితుల్లో సముద్ర తీర గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించడానికి తుఫాన్ రక్షిత భవనాలతోపాటు విద్యా సంస్థల భవనాలను సిద్ధం చేశారు.

ఇంగ్లండ్ జోరు

... 5వ పేజీ తరువాయి

అమీ జోన్స్ 75 బంతుల్లో 5 బౌండరీలు, 1 సిక్సర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేసింది. మరో ఓపెనర్ టామీ బ్యూమౌంట్ 40 పరుగులు చేసి తహు బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా అవుటైంది. హీదర్ నైట్ (33; 2 ఫోర్లు, 1 సిక్సర్) చెలరేగింది. అప్పటికే వికెట్ల ముందు పాతుకుపోయిన అమీ జోన్స్ రోజ్‌మెయిర్ బౌలింగ్‌లో మిడ్ వికెట్, మిడాఫ్ మీదుగా వరుసగా రెండు ఫోర్లు బాది మ్యాచ్‌ను ముగించింది.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన న్యూజిలాండ్ 38.2 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. టాప్ ఆర్డర్‌లో జార్జి ప్లిమ్మర్ (43), అమెలియా కెర్ (35), కెప్టెన్ సోఫీ డివైన్ (23) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. మ్యాచ్ ఎనిమిదో ఓవర్‌లో స్మిత్ బౌలింగ్‌లో అమెలియో కెర్ (35) బ్యాక్‌వర్డ్ పాయింట్, స్క్వేర్ లెగ్, మిడాఫ్, కవర్స్ మీదుగా వరుసగా నాలుగు బౌండరీలు బాది ఊపుమీద కనిపించినా తర్వాత ఓవర్‌లో క్యాప్సీ బౌలింగ్‌లో డీన్ క్యాచిచ్చి అవుటవడంతో మిగిలిన బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఇంగ్లండ్ బౌలర్లలో లిన్సీ స్మిత్ మూడు వికెట్లు పడగొట్టగా....బ్రంట్, కాప్సీ చెరో రెండు వికెట్లు...సోఫీ, చార్లీ డీన్ చెరో వికెట్ తీశారు.

భూతల నరకం!

... 5వ పేజీ తరువాయి

దెబ్బతింటున్నాయని యజమానులు, డ్రైవర్లు వాపో తు న్నారు. బీఎన్ రోడ్డుకు మర మ్మతులు చేపట్టాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ చోడవరం, మాడుగుల ఎమ్మె ల్యేలు కేఎస్ఎన్ ఎస్ రాజు, బండారు సత్యనా రాయణమూర్తి..ఉన్నతాధికారులకుచెప్పినాఫలితం లేక పో యింది.



గోవాడ వద్ద ఛిద్రమైన బీఎన్ రోడ్డు

వడ్డాది- తాటిపర్తి మధ్య..

వడ్డాది- పాడేరు ఆర్అండ్‌బీ రోడ్డులో వడ్డాది నుంచి మాడుగుల మండలం తాటిపర్తి వరకు 15 కిలోమీటర్ల మేర రహదారి పలుచోట్ల పూర్తిగా ధ్వంసమైంది. పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, హుకుంపేట మండలాల ప్రజలుమాడుగుల, చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు రావాలంటే ఈ మార్గంలోనే ప్రయాణించాలి.కానీ పలుచోట్ల ఏర్పడిన భారీ గోతులు, ఛిద్రమైన రహదారి వల్ల అన్ని రకాల వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.

ప్రతిపాదనల్లోనే నాలుగు లేన్ల రహదారి

బీఎన్ రోడ్డును పీపీపీ విధానంలో నాలుగు లేన్ల రహదారిగా విస్తరించాలని ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. ఈ రహదారి అభివృద్ధి బాధ్యతను ఈసీసీ అనే కంపెనీకి అప్పగించారు. కానీ డీపీఆర్ తయారు కాకపోవడంతో పను లు మొదలుకాలేదు. నాలుగు లేన్ల రోడ్డు కాగితాలకే పరిమితమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.



బుచ్చెయ్యపేట మండలం పొట్టిదొర పాలెంవద్ద అడుగడుగునా గోతులు

యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా

ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న అక్రమార్కులు
సంతల్లో బక్కచిక్కిన ఆవులు కొనుగోలు చేసి కబేళాలకు
వ్యాన్లలో కుక్కేసి.. తాళ్లతో బంధించి మరీ తరలింపు
ప్రతీ వారం వందల సంఖ్యలో తరలిపోతున్న పశువులు
కానరాని గో సంరక్షకులు.. పట్టించుకోని అధికారులు

మాడుగుల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మీదుగా పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఏజెన్సీ ప్రాంతాల నుంచి వ్యాన్లలో కుక్కేసి, తాళ్లతో బంధించి మరీ తీసుకుపోతున్నారు. సంతల్లో బక్కచిక్కిన ఆవులు, గేదెలను కొనుగోలు చేసి కబేళాలకు తరలిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు, గో సంరక్షకులు పట్టించుకునే పాపానికి పోవడం లేదు.

పాడేరులోని గుత్తులపుట్టు సంతబయలు సంతతో పాటు హుంకుంపేట, పెదబయలు, ఒడిశా ప్రాంతాల్లో జరిగే వారపు సంతల్లో బక్కచిక్కిన ఆవులను కొనుగోలు చేసి వ్యాన్లలో తాళ్లతో బంధిస్తున్నారు. బయటకు కనిపించకుండా లోడింగ్ చేస్తున్నారు. ఇలా లోడ్ చేసిన పది నుంచి ఇరవై వ్యాన్లను రైతుల ముసుగులో దేవరాపల్లి మండలం తిమిరం సంతకు తీసుకువెళ్తున్నారు. అక్కడి నుంచి కబేళాలకు తరలిస్తున్నారు. మరికొన్ని వాహనాల్లో ఉన్న గోవులను వడ్డాది మీదుగా హైవేకు తరలించి, అక్కడ నుంచి తుని, పాయకరావుపేట, విజయవాడ ప్రాంతాల్లో ఉన్న కబేళాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇలా ప్రతీ వారం ఏజెన్సీ ప్రాంతం నుంచి వందల సంఖ్యలో వ్యాన్లలో పశువులను తరలిస్తున్నారు. ఈ సమయంలో అధికారులు వాహనాలను ఆపి ప్రశ్నిస్తే, రైతులు ఆవులను కొనుగోలు చేసి తమ వాహనాలను అద్దెకు



వ్యాన్‌లో పశువులను తాళ్లతో బంధించి కిక్కిరిసి పడేసిన దృశ్యం



పాడేరు ఏజెన్సీ నుంచి వ్యాన్లలో తరలిస్తున్న పశువులు



తీసుకుని తరలిస్తున్నట్టు బురిడీ కొట్టిస్తున్నారు. అలాగే వ్యాన్లలో ఉన్న వారు రైతు మారువేశంలో ఉంటూ తాము రైతులమని, వ్యవసాయానికి ఉపయోగపడే పశువులను కొనుగోలు చేసి తీసుకొని వెళ్తున్నామని నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లోలో వాహనాలను ఆపిన వారితో బేరసారాలకు దిగుతూ చేతులు తడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజంగా రైతులు కొనుగోలు చేసిన పశువులైతే ఇలా ఒక్క వాహనంలోనే అధిక సంఖ్యలో ఉంచి ముక్కు, మెడలు వంచి తాళ్లతో బంధించి తరలిస్తారా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇదిలా ఉండగా పాయకరావుపేట, నక్కపల్లి సమీపంలో ఓ వ్యక్తి కబేళాలను నడుపుతున్నారని, అక్కడ కటింగ్ పూర్తయిన వాటిని మిగిలిన ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారని, వ్యాపార వర్గాల నుంచి సమాచారం. అలాగే విజయవాడ దగ్గర కోసూరు అనే ప్రాంతానికి కూడా పశువులను తరలిస్తున్నట్టు తెలిసింది. ఈ వ్యాపారులకు బడా నేతల అండదండలు ఉన్నట్టు సమాచారం. ఏదేమైనా ఏజెన్సీ ప్రాంతం నుంచి వారంలో నాలుగైదు రోజులు పశువులను అక్రమంగా తరిస్తున్నా గో సంరక్షకులుగాని, అధికారులుగాని చర్యలు తీసుకోకపోవడం దారుణమని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పశువుల అక్రమ రవాణాకు కళ్లెం వేయాలని వారు కోరుతున్నారు.



పశువులు తరలించడానికి తాటిపర్తి చెక్‌పోస్టు వద్ద నిలిపిన వ్యాన్లు

ప్లాస్టిక్ రహితంగా వన భోజన వేడుకలు

అరటి ఆకులలో ఆహార పదార్థాల వడ్డింపు
టీ, కాఫీ, తాగునీటికి స్టీల్ గ్లాసుల వినియోగం

నర్సీపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక వన భోజన మహోత్సవ కార్యక్రమం ప్లాస్టిక్ రహితంగా నిర్వహించారు. స్థానిక రాయల్ పార్కు ఆవరణలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సామూహిక వన భోజన కార్యక్రమాన్ని ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులు వాడకుండా ఏర్పాటు చేశారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం సామూహిక వన భోజనాలను అరటి ఆకులలో వడ్డించారు. టీ, కాఫీలు, తాగునీటికి స్టీల్ గ్లాసులు వాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన తాడేపల్లి గూడెంకు చెందిన గంగాధర హాస్య యోగా ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్య అతిథులు దస్త్రాల రాఘవేంద్రరావు, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ లక్ష్మీకాంత్ చేతుల మీదుగా లక్కీ డ్రాలు తీసి బహుమతులు అందజేశారు. లక్కీ మెన్, లక్కీ లేడి, లక్కీ దంపతులు, ఓవరాల్ లక్కీ డ్రా తీసి చీరలు, ట్రావెల్ బ్యాగులు, సూట్ కేస్, గృహోపకరణాలు బహుమతులుగా ప్రదానం చేశారు. పిల్లలు, మహిళలు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, కోశాధికారి అల్లు అప్పారావు, సంయుక్త కార్యదర్శి పిట్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కప్పిలి స్వామి, ఎంవీ రంగారావు, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు గజ్జాలమ్మ, పీఆర్‌టీయూ అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వన భోజనాలు వేడుకలో పాల్గొన్న మహిళలు

ఏఎల్ పురంలో సామూహిక సత్యసాయి వ్రతాలు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం రామాలయం వద్ద ఆదివారం 200 మందితో సామూహిక సత్యసాయి వ్రతాలు నిర్వహించారు. ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, కొంగశింగి తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొనగా, జిల్లా ఆధ్యాత్మిక విభాగం నుంచి విచ్చేసిన శ్రీలక్ష్మీ, రామామణి, విద్యా విభాగం జిల్లా మహిళా సమన్వయకర్త మహేశ్వరి తదితరులు భక్తులతో సత్యసాయి వ్రతాలను చేయించారు. ఈ సందర్భంగా జిల్లా ఆధ్యాత్మిక సమన్వకర్త కామరాజు నామసంకీర్తన విశిష్టతను భక్తులకు తెలియజేశారు. అనంతరం సత్యసాయి ట్రస్టు ప్రతినిధి శివరామరాజు మాట్లాడుతూ స్వామి ఎల్లప్పుడూ ఇంటా, వెంటా ఉంటూ ప్రజలను సంరక్షిస్తారని తెలిపారు. అలాగే ఐదుగురికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కో-ఆర్డినేటర్ శివకుమార్, జోన్ ఇన్‌చార్జి సత్యనారాయణ, సభ్యులు సుధాకర్‌మౌళి, సత్యనారాయణ, గాడి శ్రీనివాసరావు, కిరణ్, కృష్ణ, రమణ పాల్గొన్నారు.



ఏఎల్ పురం రామాలయంలో సామూహిక సత్యసాయి వ్రతాలు చేస్తున్న భక్తులు

వెంకయ్యపాలెంలో రేషన్ డిపో

మాకవరపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాలెం శివారు వెంకయ్యపాలెంలో ఆదివారం రేషన్ డిపోను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు దగ్గరలో ఉండేలా రేషన్ డిపోలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రతి రోజూ రెండు పూటలా రేషన్ సరుకులు అందజేసేలా డీలర్లు చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు సరుకులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎ.రామునాయుడు, నందకిశోర్, రాము, శ్రీను, అర్జున్, కన్నబాబు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

నాతవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేశ్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైల పోతురాజు, అంకంరెడ్డి రాంబాబు, అప్పలనర్స, కరక అప్పలరాజు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి, ఎం.అలమండ, కేఎం.పాలెం గ్రామాల్లో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. జడ్పీటీసీ సభ్యుడు కర్రిసత్యం, వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, ఎం.అలమండ సర్పంచ్ జగన్ పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

నాతవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పెదమికొండకు సమీపంలోని జీడి తోటలలో సారా తయారీకి ఉంచిన 400 లీటర్ల బెల్లం పులుసును ఆదివారం పోలీసులు ధ్వంసం చేశారు. గ్రామాలలో ఎక్కడైనా సారా తయారీ చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్‌ఐ తారకేశ్వరరావు హెచ్చరించారు.

మాడుగులలో చిరుజల్లులు

మాడుగుల రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సాయంత్రం తుఫాన్ ప్రభావంతో చిరుజల్లులు పడ్డాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండకాయడం, వెంటనే మబ్బు వేయడం జరిగింది. సాయంత్రం నాలుగు గంటలకు వాతావరణంలో మార్పు వచ్చింది. ఆకాశమంతా మబ్బులు కమ్ముకుని అర గంట పాటు చిరుజల్లులు పడ్డాయి. వరి పంట పొట్ట దశలో తుఫాన్ హెచ్చరికతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎస్‌ఐ పోస్టు భర్తీచేయరూ..

కృష్ణాదేవిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ పోస్టు భర్తీ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఎస్‌ఐగా పనిచేసిన వై.తారకేశ్వరరావు గత నెల 11వ తేదీన నాతవరం ఎస్‌ఐగా బదిలీ చేశారు. అప్పటి నుంచి గొలుగొండ ఎస్‌ఐ పి.రామారావు, ఇతర ఎస్‌ఐలు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఫిర్యాదుదారులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. ఎస్‌ఐ పోస్టు భర్తీ చేయకపోతే శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా ఎస్పీ స్పందించాలని కోరారు.

హోరాహోరీగా కోలాటం పోటీలు



కోలాటం పోటీల్లో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

చీడికాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాగులచవితిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం నుండి అర్ధ రాత్రి వరకు జరిగిన కోలాటం పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామానికి చెందిన కామిరెడ్డి వారి కుటుంబం ఆర్థిక సాయంతో పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో సిరిజాం గ్రామానికి చెందిన కళాకారులకు మెదటి, మూడో బహుమతులు లభించాయి. అర్జునగిరి గ్రామానికి చెందిన కళాకారులు రెండో స్థానంలో నిలిచారు. వీరికి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన కామిరెడ్డి దేముడు, ఎర్ర అప్పారావు, గండి మునిలినాయుడు, కామిరెడ్డి కన్నంనాయుడు, ఎరుకునాయుడు, బొడ్డు శ్రీనివాసరావు తదితరులు చేతుల మీదుగా నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ పోటీలను పరిసర ప్రాంతాలు ఆసక్తిగా తిలకించారు.

రావికమతంలో నాలుగు పునరావాస కేంద్రాలు

రావికమతం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపాచిల, రావికమతం, మేడివాడ, కొత్తకోట గ్రామాల పాఠశాలల్లో తాత్కాలిక పునరావాస కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. తుఫాన్ కారణంగా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ప్రజలను ఈ పునరావాస కేంద్రాలకు తరలించేందుకు వీలుగా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని ఎంపీడీవో మహేశ్ తహశీల్దార్ అంబేద్కర్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి తెలిపారు. ఈ పాఠశాలను తమ ఆధీనంలోకి తీసుకుని పారిశుధ్య పనులు చేయిస్తామని, బ్లీచింగ్ చల్లిసామని, అన్ని వనరులను శుద్ధి చేస్తామని ఆయన తెలిపారు. తాగునీరు, విద్యుత్ ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, వీఆర్వోలకు పలు సూచనలు చేశారు. తుఫాన్ కారణంగా కల్యాణపులోవ రిజర్వాయర్ పరిసరాలకు ఇతరులు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈ సూర్యను ఆదేశించారు.



మేడివాడలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

తుఫాన్‌పై ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

రావికమతం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ అంబేడ్కర్ సూచించారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో ఇక్కడ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. దీనికి అన్ని శాఖల అధికారులు అందుబాటులోనే ఉంటారన్నారు. తుఫాన్ వర్షాలకు చెరువు గట్లు, కాలువలు, వాగులకు గండ్లు పడినా, పంట నష్టం జరిగినా, ఇళ్లు కూలినా వెంటనే కంట్రోల్ రూమ్‌లోని 8934294438 హెల్ప్ లైన్ నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. తుఫాన్ దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా ఈ నెల 30లోగా కాన్పులు జరిగే వివిధ గ్రామాలకు చెందిన ముగ్గురు గర్భిణులను ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించినట్టు ఆయన తెలిపారు. రైతులు, కూలీలు వర్షాలు పడే సమయంలో బయటకు వెళ్లవద్దని సూచించారు.

తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రోలుగుంట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా గ్రామాల్లో పరిస్థితిని తెలుసుకునేందుకు, ప్రజలకు సహాయం అందించేందుకు తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ నాగమ్మ తెలిపారు. ఇప్పటికే మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేసినట్టు చెప్పారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచామని, పారిశుధ్య నిర్వహణ, వైద్య సాయం పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్యదర్శులు, వైద్య సిబ్బందిని ఆదేశించామని ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. అత్యవసరమైతే 08932-225840 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఏపీ ఈపీడీసీఎల్ ఏఈఈ కర్రి శంకరరావు ఆదివారం తెలిపారు. తుఫాన్ కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగినా, తీగలు తెగిపడినా, స్తంభాలు కూలినా ముట్టుకోవద్దని ఆయన సూచించారు. వెంటనే అందుబాటులో ఉన్న సచివాలయం లైన్‌మన్లు, లేదా ఏఈఈకి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

తుఫాన్‌పై ముందు జాగ్రత్త చర్యలు

నాతవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ను ఎదుర్కోవడానికి ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తహశీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ఎలాంటి నష్టం జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే ఎక్స్‌కవేటర్, చెట్లు నరికే యంత్రాలను కూడా సిద్ధంగా ఉంచామన్నారు. ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణులను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చేర్పించామని తెలిపారు. మండల ప్రజలు నిత్యావసర సరకులను ఉంచుకోవాలని ఆయన కోరారు.

తాండవ పరిసరాల్లో అధికారుల పర్యటన

గొలుగొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా తాండవ నదీ పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని అమ్మపేట, జోగంపేట సాలికమల్లవరం, గొలుగొండ, గాదంపాలెం, చోద్యం, పొగచెట్లపాలెం తదితర గ్రామాల్లో ఆదివారం తాండవ నదీ పరివాహక గ్రామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు తాండవ రిజర్వాయర్‌లోకి చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించారు. అత్యవసరమైతే తప్పా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులకు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి మూర్తి, స్థానిక నేత గొర్లి రవి పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో తాండవ రహదారి నిర్మాణానికి ప్రతిపాదన

నాతవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తాండవ రహదారి నిర్మాణానికి రూ.30 లక్షలతో ప్రతిపాదనలు చేశామని రోడ్లు భవనాల శాఖ ఏఈ నాయుడు తెలిపారు. ఈ రోడ్డు అధ్వానంగా ఉందని, కొత్తగా రహదారి నిర్మించాలని చమ్మచింత గ్రామానికి చెందిన శ్రేయోభిలాషి సంస్థ వ్యవస్థాపకులు నానాజీ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ రహదారిని అధికారులు, నానాజీతో కలిసి ఆదివారం పరిశీలించారు. పెద్ద పెద్ద గోతులతో ఉన్న ఈ రోడ్డులో నడవటానికి కూడా ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా స్థానికులు తెలిపారు. అనంతరం ఏఈ మాట్లాడుతూ ఇప్పటివరకు తాండవ ఇరిగేషన్ ఆధీనంలో ఉన్న రోడ్డు 2025 మే నెలలో ఆర్అండ్‌బీలో విలీనమైందన్నారు. దీంతో రోడ్డు నిర్మాణానికి ఆగస్టులో ప్రతిపాదనలు పంపామని చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే తాండవ రోడ్డు పనులు చేస్తామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

మాకవరపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో తామరం రెవెన్యూ పరిధిలోని 61/3 సర్వే నంబరులో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 'ప్రభుత్వ భూముల ఆక్రమణలు' అనే శీర్షికతో ఈ నెల 24న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు గెడ్డ పోరంబోకు భూమిలో వీఆర్‌వో శాంతికుమారి, సిబ్బంది వెళ్లి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సర్వే నంబరు లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామని తహశీల్దార్ బి.వెంకటరమణ హెచ్చరించారు. అలాగే మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణ చేసినట్టు ఫిర్యాదులు వస్తే సహించేది లేదని ఆయన చెప్పారు.



తామరం 61/3లో హెచ్చరిక బోర్డు పాతిన రెవెన్యూ అధికారులు

ఆర్టీసీ ప్రయాణికుల తిప్పలు

దేవరాపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్సులో బస్సుల కోసం ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. చాలా సేపటి తర్వాత ఏదో ఒక బస్సు వచ్చినా, అందులో సీట్ల కోసం పరుగులు తీయాల్సి వస్తోంది. దేవరాపల్లి, కొత్తవలస రహదారిలో కృష్ణారాయుడు పేట వద్ద కల్వర్టు కుంగిపోవడంతో విశాఖపట్నం 12డి, 68డి బస్సులు అక్కడే నిలిపివేసి, 12డి బస్సులు కె.కోటపాడు మీదుగా తిప్పడంతో ప్రయాణికులకు తిప్పలు మొదలయ్యాయి. కృష్ణారాయుడుపేట వరకు వచ్చి వెళ్తున్న బస్సులు, అక్కడికి వెళ్లేసరికి ఉండడం లేదు. దేవరాపల్లిలోకి గతంలో ఒక బస్సు వస్తే, మరోక బస్సు వెళ్లేది. ఇప్పుడు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏదో ఒక బస్సు వచ్చినా సీటు కోసం పరుగులు పెడుతున్నామని, అయినప్పటికీ సీటు దొరకక నిలబడి ప్రయాణిస్తున్నామని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



బస్సు కోసం ఎగబడుతున్న మహిళలు

వడ్డాది డైవర్షన్ రహదారిపై వరద



వడ్డాదిలో నీట మునిగిన డైవర్షన్ రోడ్డు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది డైవర్షన్ రహదారిపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఏజెన్సీలో భారీగా వర్షాలు పడుతుండడంతో పెద్దేరు జలాశయం నిండిపోయింది. దీంతో ఇరిగేషన్ అధికారులు నదిలోకి నీటిని విడుదల చేయడంతో ఆదివారం ఉదయం నుంచి డైవర్షన్ రోడ్డుపై నీరు ఏరులై పారింది. ఫలితంగా రాకపోకలు తీవ్ర అవాంతరం ఏర్పడింది. దీంతో వాహన చోదకులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షపాతం పెరిగితే డైవర్షన్ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది.

కొబ్బరి చెట్టు కూలి విరిగిన విద్యుత్ స్తంభం

రావికమతం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు కొబ్బరి చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో స్తంభం నేలకొరిగింది. ఈ సంఘటన మండలంలోని మేడివాడ పంచాయతీ శివారు దిడ్డి గ్రామం వద్ద ఆదివారం జరిగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇటీవల కురిసిన వర్షాలకు కొబ్బరి చెట్టు మొదలు కుళ్లిపోయింది. దీంతో పట్టు తప్పి విద్యుత్ వైర్లపై కూలడంతో స్తంభం నేలకొరిగింది. గ్రామస్థులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు.



కూలిపోయిన చెట్టు, విద్యుత్ స్తంభం

కామునిగెడ్డను మేజర్ ఇరిగేషన్ ట్యాంకుగా గుర్తించాలని జలదీక్ష

రావికమతం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామునిగెడ్డ మినీ రిజర్వాయర్‌ను మేజర్ ఇరిగేషన్ ట్యాంకుగా గుర్తించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ గిరిజన మత్స్యకారులు ఆదివారం జలదీక్ష చేపట్టారు. పోతురాజుబాబు గిరిజన మత్స్యకార సంఘ సభ్యులు ఆదివారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు గోరా చిరంజీవి మాట్లాడుతూ 315 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కామునిగెడ్డ మినీ రిజర్వాయర్‌లో చేప పిల్లలు పెంచుకునేవారమని, తర్వాత ప్రభుత్వ చేప పిల్లల సరఫరా నిలిపివేయడంతో ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఈ ఏడాది ఆగస్టులో కామునిగెడ్డ రిజర్వాయర్‌ను మేజర్ ఇరిగేషన్‌గా గుర్తించాలని జిల్లా కలక్టర్‌ను విన్నవించినట్టు చెప్పారు. అయినప్పటికీ ఫలితం లేకపోయిందని వాపోయారు. ప్రభుత్వం మత్స్యకారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నప్పటికీ, మత్స్య శాఖ అధికారుల తీరుతో తమకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, నాయకులు సిరగం అర్జున్, లవడు ఎర్రయ్య, మత్స్యకారులు పాల్గొన్నారు.